SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

సంపుటి: 18 | సంచిక: 346 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 1 సెప్టెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



# భారత్, రష్యాది బలమైన స్నేహం

- పరస్పర అవగాహనతో ముందుకు సాగుతున్నాం
- షాంఘై వేదిక నుంచి ప్రధాని మోడీ

ఎప్పుడు కష్టకాలం ఎదురైనా భారత్,రష్యాలు పరస్పర స్నేహంతో ముందుకు సాగాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తమబంధం ఇరుదేశాల ప్రజలకే కాకుండా.. ప్రపంచ శాంతి, స్థిరత్వం, సుసంపన్నతకు చాలా అవసరమన్నారు. ఇరుదేశాల మధ్య తరచూ జరుగుతున్న ఉన్నతస్థాయి భేటీలు తమ మధ్య ఉన్న ప్రత్యేక బంధాన్ని తెలియజేస్తున్నాయన్నారు. భారత్-రష్యా సంబంధాలు కొన్ని సూత్రాల ఆధారంగా బలంగా ఉన్నాయని అభివర్ణించారు.

02

# అన్నమయ్య ప్రాజెక్టును అనాథగా మిగిల్చారు

- ప్రాజెక్ట్ కొట్టుకు పోయి ఐదేళ్లయినా పట్టించుకోరా
- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శలు





05

# కేసీఆర్ వెనక గోతులు తవ్వేది ఇద్దరే



- హరీష్ రావు, సంతోష్ వెనక రేవంత్ హస్తం
- కాళేశ్వరం కుట్రల సూత్రధారి హరీష్‌రావు
- కేసీఆర్‌ను అడ్డంపెట్టుకుని వారు భారీగా ఆస్తులు కూడబెట్టారు
- ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్లే ఆయనకు చెడ్డపేరు వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్‌ను బద్నాం చేసే పనిలో హరీష్ రావు, సంతోష్ పాత్ర ఉందని, వారి వెనక సీఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలం ఉందని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

3



# బీసీ బిల్లుకు మండలి ఆమోదముద్ర

## బీఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్య ముగిసిన మండలి


- కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగించడంపై బీఆర్ఎస్ గందరగోళం
- శాసనమండలిలో హై టెన్షన్ వాతావరణం
- కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నినాదాలు
- సభ్యులపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం
- నాలుగు బిల్లులను పాస్ చేసిన మండలి

తెలంగాణ శాసనమండలి సోమవారం ప్రారంభమైంది. అయితే సభ ప్రారంభించిన తర్వాత బీఆర్ఎస్ సభ్యుల గందరగోళం నడుమ నాలుగు బిల్లులను మండలి ఆమోదించింది. మొదటగా బీసీ బిల్లుపై చర్చించి ఆమోదం తెలిపింది. ఆ తర్వాత పంచాయతీరాజ్ చట్టసవరణ, పురపాలక సంఘాల చట్టసవరణ, అల్లోపతిక్ ప్రైవేటు వైద్య సంరక్షణ సంస్థల చట్టం రద్దు బిల్లులకు శాసనమండలి ఆమోదం తెలిపింది. బీఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్యనే మండలిలో నాలుగు బిల్లులు ఆమోదం పొందాయి. మ-రోవైపు.. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగిస్తూ అసెంబ్లీ నిర్ణయం తీసుకోగా, దీన్ని వ్యతిరేకిస్తూ శాసన మండలిలో బీఆర్ఎస్ సభ్యులు గందరగోళం సృష్టించారు. చైర్మన్ పోడియం దగ్గర బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** తెలంగాణ శాసనమండలలో సోమవార బీఆర్ఎస్ సభ్యుల గందరగోళం నడుమ నాలుగు బిల్లులను మండలి ఆమోదించింది. ఆ తరవాత నిరవధికంగా వాయిదా పడింది. మొదటగా బీసీ బిల్లుపై చర్చించి ఆమోదం తెలిపింది. ఆ తర్వాత పంచాయతీరాజ్ చట్టసవరణ, పురపాలక సంఘాల చట్టసవరణ, అల్లోపతిక్ ప్రైవేటు- వైద్య సంరక్షణ సంస్థల చట్టం రద్దు బిల్లులకు శాసనమండలి ఆమోదం తెలిపింది. బీఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్యనే మండలిలో నాలుగు బిల్లులు ఆమోదం పొందాయి. అసెంబ్లీలోకాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగిస్తూ అసెంబ్లీ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శాసన మండలిలో బీఆర్ఎస్ సభ్యులు గందరగోళం సృష్టించారు.

మిగతా 2 లో

# అసెంబ్లీకి రండి.. చర్చిద్దాం



- పెన్షన్ అనేది దానం కాదు.. ప్రభుత్వాల బాధ్యత
- తెలుగు వారికి పెన్షన్ పరిచయం చేసింది ఎన్టీఆరే
- 30 ఏళ్ల క్రితం తొలిసారిగా సీఎం అయ్యా.. ఏనాడూ విశ్రమించలేదు
- కూటమి గెలిచింది.. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చింది
- పింఛన్ల పంపిణీ, ప్రజా వేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు

05

# బీసీ బిల్లుకు ఆమోదం తెలపండి

3

- గవర్నర్‌ను కోరిన అఖిలపక్షం నేతలు
- అసెంబ్లీ ఆమోదంపై వివరణ



# ఎడ్యుకేషన్ పాలసీ ఏర్పాటు

- కమిటీ చైర్మన్‌గా ప్రభుత్వ సలహాదారుడు కె. కేశవరావు

.. వివరాలు 2లో



# సీబీఐ విచారణకు భయపడేది లేదు

3

- రాహుల్ వద్దన్న సీబీఐ రేవంత్‌కు ముద్దు
- గోదావరి జలాలపై బాబుతో కలసి కుట్ర
- ఎక్స్ వేదికగా కేటీఆర్

సీబీఐకే కాదు, ఏ ఏజెన్సీకి కాళేశ్వరం విచారణ అప్పచెప్పినా బీఆర్ఎస్ పార్టీ భయపడదని కేటీఆర్ చెప్పారు. బీజేపీతో కలిసి కాంగ్రెస్ చేస్తున్న ఈ కుట్రలను ధైర్యంగా ఎదుర్కొం టామన్నారు. న్యాయస్థానాలపైన తమకు సంపూర్ణ నమ్మకం ఉందన్న కేటీఆర్.. అక్కడ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. బెదిరింపులు, కేసులు తమకు కొత్త కాదని చెప్పారు.



# కాళేశ్వరం అవినీతికి బీఆర్ఎస్‌దే బాధ్యత

## సీబీఐ విచారణకు ముందు నుంచే బీజేపీ డిమాండ్

- ఆలస్యంగా అయినా స్పందించిన ప్రభుత్వం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్య
- 22 నెలల పాటు నిర్లక్ష్యం : లక్ష్మణ్

03



# భారత్, రష్యాది బలమైన స్నేహం

## షాంఘై వేదిక నుంచి ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** ఎప్పుడు కష్టకాలం ఎదురైనా భారత్,రష్యాలు పరస్పర స్నేహంతో ముందుకు సాగాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తమబంధం ఇరుదేశాల ప్రజలకే కాకుండా.. ప్రపంచ శాంతి, స్థిరత్వం, సుసంపన్నతకు చాలా అవసరమన్నారు. ఇరుదేశాల మధ్య తరచూ జరుగుతున్న ఉన్నతస్థాయి భేటీలు తమ మధ్య ఉన్న ప్రత్యేక బంధాన్ని తెలియజేస్తున్నాయన్నారు. భారత్-రష్యా సంబంధాలు కొన్ని సూత్రాల ఆధారంగా బలంగా ఉన్నాయని అభివర్ణించారు. బహుముఖ సహకారంతో తాము ముందుకువెళుతున్నట్లు- పేర్కొన్నారు. తమ బంధం రాజకీయాలకు అతీతంగా చాలా విశ్వాసపూర్వక మైందని ప్రధాని అభివర్ణించారు. భారత్-రష్యా ద్వైపాక్షిక సదస్సు తింజాయన్‌లోని రిట్జ్ కార్లటోన్ హోటల్‌లో మొదలైంది. ఇక రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగియాలని మానవాళి కోరుకుంటోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇరుపక్షాలు ఈ దిశగా అడుగులు వేస్తాయని ఆశిస్తున్నట్లు- చెప్పారు. ఇటీవల జరిగిన శాంతి ప్రయత్నాలను స్వాగతిస్తున్నామన్నారు. డిసెంబర్‌లో జరగనున్న భారత్-రష్యా సదస్సుకు పుతిన్ రాక కోసం 140 కోట్ల మంది భారతీయులు ఎదురు చూస్తున్నారని ఈ సందర్భంగా ప్రధాని మోదీ చెప్పారు. ఇక ఈ భేటీలో పుతిన్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీని ఆప్తమిత్రుడిగా అభివర్ణించారు. భారత పీఎంతో భేటీ- కావడంపై ఆయన సంతోషం వ్యక్తంచేశారు. షాంఘై సహకార సదస్సు గ్లోబెల్ సౌత్, ఈస్ట్ దేశాలకు ఓ బలమైన వేదిక అని అభివర్ణించారు. రానున్న కాలంలో జరగనున్న భారత్-రష్యా ద్వైపాక్షిక సదస్సు తమ బహుముఖ బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

# ఎడ్యుకేషన్ పాలసీ ఏర్పాటు

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ ఏర్పాటుకు సోమవారం కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చైర్మన్‌గా ప్రభుత్వ సలహాదారుడు కె. కేశవరావును నియమించింది. ఆయనతో సహా ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్ 9వ తేదీన ఈ కమిటీ.. తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది.

# నోటీసులపై మరో వారం గడువు కోరాం: కడియం

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** మాకు మరో వారం రోజుల గడువు ఇవ్వండి అని ఫిరాయింపు ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కోరారు. కడియం శ్రీహరి తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ స్పీకర్ నుంచి తమకు నోటీసు వచ్చింది వాస్తవమేనన్నారు. సెప్టెంబర్ 2వ తేదీలోగా నోటీసుకు సమాధానం ఇవ్వాల్సి ఉందని ఆయన తెలిపారు. అయితే ఈ గడువు సరిపోదని, ఈ గడువు తర్వాత కూడా తమకు అదనంగా మరో వారం రోజుల సమయం ఇవ్వాలని కోరగా అందుకు స్పీకర్ సమ్మతించారని ఆయన చెప్పారు. ఈ గడువులో తాము సమాధానం ఇస్తామని కడియం తెలిపారు. పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. రాజ్యాంగంలోని పదవ షెడ్యూలు ప్రకారం ఫిరాయించిన ఎమ్మెల్యేల శాసనసభ్యత్వాలను రద్దు చేయాలని కోరుతూ బిఆర్ఎస్ ఒకవైపు స్పీకర్‌కు నోటీ-సు ఇవ్వడం, మరోవైపు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఇదిలాఉండగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సమాధానం తెలియజేయాలంటూ నోటీసు పంపించారు.

# బతుకమ్మకు అంతర్జాతీయగుర్తింపు

## పోస్టర్ విడుదల చేసిన మంత్రులు




**హైదరాబాద్,సెప్టెంబర్1:** బతుకమ్మ పండుగను అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు దక్కేలా, గిన్నిస్ రికార్డు చోటుచేసుకునేలా గొప్ప కార్నివాల్‌గా నిర్వహిస్తామని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. బతుకమ్మకు జాతీయస్థాయి ప్రచారం కోసం కొన్ని విమానయాన సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నాం అని మంత్రి జూపల్లి తెలిపారు. ఈ నెల 21 నుంచి 30 వరకు బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 21న వేయిస్తంభాల గుడిలో బతుకమ్మ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. గిన్నిస్ బుక్ రికార్డ్స్ సాధించే లక్ష్యంతో ఈనెల 29న ఎల్బీస్టేడియంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తాం అన్నారు పీపుల్స్ ప్లాజాలో మహిళా స్వయం సహాయక సంఘాలతో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తాం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో విద్యార్థులంతా పాల్గొనేలా వేడుకలుంటాయి. బతుకమ్మ వేడుకల ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రచారం కల్పిస్తామని మంత్రి కొండా తెలిపారు. ఈ పండుగ గురించి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గురించి దేశవిదేశాలకు తెలిసేలా చేస్తామన్నారు. పర్యాటకశాఖ, మహిళలను భాగస్వామ్యం చేస్తూ వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. ఈసందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే పండగ నిర్వహణకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

# కాళేశ్వరంపై సీబీఐ విచారణ

## శాసనమండలిలో బీఆర్ఎస్ ఆందోళన

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ఇవ్వడాన్ని నిరసరగా శాసన మండలిలో బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన నిర్వహిస్తున్నారు. చైర్మన్ పోడియాన్ని ముట్టడించిన ఎమ్మెల్సీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తున్నారు. మండలి కార్యకలాపాలను అడ్డుకున్నారు. జై తెలంగాణ నినాదాలతో మండలిని హోరెత్తించారు. కాళేశ్వరం నివేదిక ప్రతులను చించి చైర్మన్‌పైకి విసిరి నిరసన వ్యక్తం చేశారు. రాహుల్‌కు సీబీఐ వద్దు, రేవంత్‌కు సీబీఐ ముద్దు, రాష్ట్రాన్ని బాగుచేస్తే సీబీఐ కేసులా.. సిగ్గుసిగ్గు, బడేభాయ్.. చోటేభాయ్ ఏక్ హై.. కాళేశ్వరం రిపోర్ట్ ఫేక్ హై, వియ్ వాంట్ జస్టిస్ అంటూ అంటూ నినాదాలు చేసారు.

# బీసీ బిల్లుకు మండలి ఆమోదముద్ర

మొదటి పేజీ తరువాయి

చైర్మన్ పోడియం దగ్గర బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో శాసనమండలిలో కొంత గందరగోళ వాతావరణం నెలకొంది. కాళేశ్వరం కమిషన్ నివేదిక పేపర్లు చింపి మండలి చైర్మన్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి సీబీఐ వద్దు.. రేవంత్‌కు సీబీఐ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడియం వద్ద నిరసన వ్యక్తం చేయొద్దని.. వారికి కేటాయించిన స్థానాల్లోనే నిరసన వ్యక్తం చేయాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసనలతో శాసనమండలి నిరవధికంగా వాయిదా పడింది. శాసనమండలిలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ సభ్యులపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జై తెలంగాణ నినాదాలు చేసే అర్హత బీఆర్ఎస్‌కు లేదని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారతీయ రాష్ట్ర సమితిగా మార్చినప్పుడే తెలంగాణతో టీఆర్ఎస్ బంధం తెగిపోయిందని చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రజలను అడుగడుగునా మోసం చేసిన టీఆర్ఎస్‌కు తెలంగాణ మాట పలికే అర్హత కోల్పోయిందని మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు.

# తెలుగువాడిగా సుదర్శన్ రెడ్డిని బలపర్చాలి

- ఆత్మప్రబోధానుసారం ఓటేయండి
- చంద్రబాబు, జగన్, పవన్‌కు సీఎం రేవంత్ పిలుపు




**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రకటించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఆలోచనను ఆయన గౌరవించారని చెప్పారు. హైదరాబాద్‌లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో కలిసి సీఎం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నికకు అంత్యంత ప్రాధాన్యత ఉంది. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్‌లు రద్దు చేయాలనే ఎజెండాతో ఎన్డీయే అభ్యర్థిని పెట్టింది. రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని బరిలోకి దింపింది. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలపై ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చు. కానీ.. తెలుగువాడికి ఇప్పుడొక అవకాశం వచ్చింది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మాజీ సీఎంలు కేసీఆర్, జగన్, ఎంఐఎం అధ్యక్షుడు అక్బరుద్దీన్ ఒవైసీలకు విజ్ఞప్తి చేస్తున్నా. రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డికి పార్టీలకతీతంగా ఓటెయ్యాలన్నారు. తాజ్ కృష్ణ హోటల్‌లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి వివేక్ ,తుమ్మల,పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీ గడ్డం వంశీతో పాటు పలువురు ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్.. సుదర్శన్ రెడ్డి పోటీతో ఎన్డీయే కూటమిలో భయం మొదలైందన్నారు. రాజ్యాంగ రక్షణ కోసమే ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేస్తుందని చెప్పారు. రాజ్యాంగాన్ని మార్చడం కోసం..రద్దు కోసం ఎన్డీయే పోటీ చేస్తుందని విమర్శించారు. పీవీ, జైపాల్ రెడ్డి జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారని అన్నారు రేవంత్.. సుదర్శన్ రెడ్డి రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేశారని చెప్పారు. చంద్రబాబు,కేసీఆర్, జగన్ ,పవన్, అసద్ ఆత్మ ప్రభోదానుసారం ఓటెయ్యాలన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి..అందరం ఏకతాటిపై వచ్చి తెలుగు బిడ్డను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సుదర్శన్ రెడ్డి గెలుపు దేశ రాజకీయాల్లో మలుపు తిప్పుతుందన్నారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగ, రాజ్యాంగ రక్షణ కోసమే సుదర్శన్ రెడ్డిని నిలబెట్టామన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే దేశాన్ని కాపాడుకోగలమని చెప్పారు.

# కేసీఆర్‌కు మరోమారు హైకోర్టులో చుక్కెదురు

## సీబీఐ విచారణ జరపకుండా ఆపలేమన్న కోర్టు

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** హైకోర్టులో కేసీఆర్, హరీష్ రావుకు మరోమారు చుక్కెదురయ్యింది. కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఆపాలని ప్రభుత్వాన్ని ఆదేశించలేమని తెలంగాణ హైకోర్టు తెలిపింది. కాళేశ్వరం నివేదికపై హైకోర్టులో కేసీఆర్, హరీశ్ మరోసారి మెన్షన్ చేశారు. కాళేశ్వరంపై విచారణను సీబీఐకి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని.. రేపటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పిటిషన్‌లో తెలిపారు హరీశ్ తరపు న్యాయవాదులు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని కోరారు. ఈ సందర్భంగా విచారణ జరిపిన హైకోర్టు హరీశ్ పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. సీబీఐ విచారణను ఆపాలంటూ ప్రభుత్వాన్ని తాము ఆదేశించలేమని తెలిపింది. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమంది. తదుపరి విచారణను సెప్టెంబర్ 2కి వాయిదా వేసింది. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ ఎంక్వైరీ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ పై ఆదివారం అసెంబ్లీలో 10 గంటల పాటు సుదీర్ఘ చర్చ అనంతరం సంచలన ప్రకటన చేశారు. కాళేశ్వరం కమిషన్ నివేదికలో ఎన్నో విచారణార్హమైన అంశాలు, అంతర్రాష్ట్ర వ్యవహారాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఉన్నందున సీబీఐ విచారణకు అప్పగిస్తున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, నీటి పారుదల శాఖ మాజీ మంత్రి హరీష్ రావు కాళేశ్వరం నివేదికపై హైకోర్టును ఆశ్రయించారు. ఆదివారం నాడు హైకోర్టులో మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. ఘోష్ నివేదికను ఆధారంగా చేసుకుని తమపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అయితే, నిన్న విచారణ చేయడానికి కోర్టు నిరాకరించింది. దీంతో సోమవారం అదే బెంచ్‌లో లంచ్ మోషన్ పిటిషన్ వేసి విచారణ జరపాలని కోరారు. కోర్టు లంచ్ మోషన్‌కు కూడా స్వీకరించలేదు. రెగ్యులర్ పిటిషన్లలాగే ఆ పిటిషన్‌ను కూడా విచారణ జరుపుతామని హైకోర్టు తెలిపింది. మంగళవారం ఉదయం 10.30 గంటలకు విచారణ చేస్తామని పేర్కొంది. రేపటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించలేమని, సీబీఐ విచారణ ఆపాలనీ ఆదేశించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా హైకోర్టులో కేసీఆర్ తరఫు న్యాయవాది సుందరం మాట్లాడుతూ.. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని చీఫ్ జస్టిస్ ముందు ప్రస్తావించారు. ఇద్దరినీ ఉరి తీయాలని ముఖ్యమంత్రి అసెంబ్లీలో మాట్లాడారని అన్నారు. కేసును సీబీఐకి అప్పగించాలని అసెంబ్లీలో నిర్ణయం జరిగినట్లు వెల్లడించారు. అందుకే అర్జెంట్‌గా పిటిషన్‌ను విచారించాలని కోరుతున్నామన్నారు. ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాగా, మంగళవారం నాడు ఈ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది.

# మహిళల అభివృద్ధిలో రోల్ మోడల్

## మహిళా సంఘాలకే చేప పిల్లల పెంపకం బాధ్యతలు

## మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ

## కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్ గా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ప్రజాభవన్ లో మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను చూసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల వారు తెలంగాణ రాష్ట్రానికి వచ్చే పరిస్థితిని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 46 వేల చెరువులు చేప పిల్లల పెంపకానికి 122 కోట్లు- విడుదల చేశామని డిప్యూటీ-సీఎం తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో చేప, రొయ్య పిల్లల పెంపకం బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగిస్తామని ప్రభుత్వం ఆ మేరకు కార్యాచరణ రూపొందిస్తుందని డిప్యూటీ- సీఎం తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వారి తో సోలార్ పవర్ ఎ÷-లాంట్ లు ఏర్పాటు- చేయించి ప్రభుత్వమే వారి నుంచి విద్యుత్ కొనుగోలు చేసి ఆదాయం సమకూర్చే కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో మహిళల చేత పెద్ద ఎత్తున వ్యాపారం చేయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీ-శ్వరులుగా తీర్చిదిద్దేందుకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం 20 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించి మొదటి సంవత్సరంలో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 21,600 కోట్లు- వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్టు- తెలిపారు. హై-టె-క్ సిటీ- పక్కన శిల్పారామం వద్ద విలువైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చి ఆర్థికంగా వారిని ప్రోత్సహిస్తుందని డిప్యూటీ- సీఎం తెలిపారు. అన్ని జిల్లాల్లో డ్వాక్రా బజార్లో ఏర్పాటు- ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. రాష్ట్ర మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని ప్రపంచంతో పోటీ- పడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో ఇచ్చే ప్రతి రూపాయి రాష్ట్ర జిడిపి పెరుగుదలకు దోహదపడుతుందన్న నమ్మకతో ఉన్నామని తెలిపారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు స్వయం సహాయ సంఘాల సభ్యులను గాలికి వదిలేశారు ప్రజా ప్రభుత్వం రాగానే వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు- తెలిపారు. బలమైన కుటుంబ వ్యవస్థ కేవలం మహిళల ద్వారానే సాధ్యమవుతుంది అన్నారు. ?కార్యక్రమంలో క్రీడలు పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు- సాయికుమార్, ఊ÷ూ సీఈఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.



# సీబీఐ విచారణకు భయపడేది లేదు

- రాహుల్ వద్దన్న సీబీఐ రేవంత్‌కు ముద్దు
- గోదావరి జలాలపై బాబుతో కలసి కుట్ర
- ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదికను ఆదివారం ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రభుత్వ, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ కేసును సీబీఐకి అప్పగిస్తామని అన్నారు. అయితే ఈ విషయంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మండిపడ్డారు. 'ఎక్స్' వేదికగా ఆయన సీఎం రేవంత్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సెటర్లు వేశారు. తెలంగాణలో కరెన్సీ మేనేజర్ (సీఎం) కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తారట. గతంలో రాహుల్ గాంధీ దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాలను అంతం చేసే సెల్స్ అని అన్నారు. మిస్టర్ గాంధీ మీకు తెలుసా.. మీ సీఎం ఏం చేస్తున్నారో? ఇలా ఎంత బెదిరించినా.. భయపడేది లేదని.. రాజకీయంగా, న్యాయపరంగా పోరాటం చేస్తాం. ప్రజలపై, న్యాయవ్యవస్థపై మాకు నమ్మకం ఉందని కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీంతో పాటు గతంలో రాహుల్ చేసిన పోస్ట్‌కి సంబంధించిన స్క్రీన్ షాట్‌ను ఆయన జత చేశారు. ఇదిలావుంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ సాకుతో చంద్రబాబు, మోదీలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి భారీ కుట్ర పన్నుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. సీబీఐ విచారణ పేరుతో కేవలం కేసీఆర్, బీఆర్ఎస్ మీదనే దాడి జరగడం లేదన్న కేటీఆర్.. తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి మన గోదావరి జలాలను ఆంధ్రకు తరలించే కుతంత్రాలకు ఆ ముగ్గురు తెరతీశారని మీడియా వద్ద విమర్శించారు. తెలంగాణ గొంతుకగా ఉన్న కేసీఆర్, బీఆర్ఎస్‌లను లేకుండా చేసి తెలంగాణపై తిరిగి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మోదీ, చంద్రబాబు ఎజెండా మేరకు బనకచర్ల ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రేవంత్ రెడ్డి.. తెలంగాణ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని, ఇక్కడి రైతుల నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించడం అంటే ప్రాజెక్టును పూర్తిగా ఎండబెట్టడమేనని అన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలను మోదీ జేబు సంస్థలుగా విమర్శించిన రేవంత్.. 48 గంటల్లోనే ఎందుకు మాట మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఓ వైపు కాంగ్రెస్ అగ్రనాయకత్వం అంతా కేంద్ర దర్యాప్తు సంస్థలను అధికార బీజేపీ దుర్వినియోగం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. రేవంత్ రెడ్డి మాత్రం మోదీ ప్రాపకం కోసం వాటిని ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీకి చేదుగా అనిపించిన సీబీఐ, రేవంత్‌కు మాత్రం ముద్దొస్తుందా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశాన్ని సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కోరగానే సీబీఐకి అప్పజెప్పడం ఆ రెండు పార్టీల అక్రమ బంధానికి సాక్ష్యం అని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడిగా, బంగారు తెలంగాణ నిర్మాతగా చరిత్ర సృష్టించిన కేసీఆర్ మీద విష ప్రచారం చేయాలన్న దుర్మార్గ, రాక్షస ఆలోచనతో రేవంత్ ఉన్నాడని కేటీఆర్ విరుచుకుపడ్డారు. గతంలో ఎస్ఎల్బీసీ టన్నెల్ కుప్పకూలినా, సుంకిశాలలో సైడ్‌వాల్ కూలినా, వట్టెం పంప్ హౌజ్ కూలిపోయినా, పెద్దవాగు రెండుసార్లు కొట్టుకుపోయినా కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. అప్పుడు రాని జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ–మేడిగడ్డ రెండు పిల్లర్లు కుంగితే మాత్రం ఆగమేఘాల మీద వచ్చి తలాతోకలేని రిపోర్ట్ ఇచ్చిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి మీద ఈగ కూడా వాలకుండా ప్రధాని మోదీ కాపాడుతున్న సంగతిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. పద్నాలుగేళ్లు ఉద్యమంలో, పదేళ్లు ప్రగతి ప్రస్థానంలో, రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్షంగా తెలంగాణ ఏకైక గొంతుకగా నిలుస్తున్న కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని అణచివేసే కుట్రలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందన్నారు. సీబీఐకే కాదు, ఏ ఏజెన్సీకి కాళేశ్వరం విచారణ అప్పచెప్పినా బీఆర్ఎస్ పార్టీ భయపడదని చెప్పారు. బీజేపీతో కలిసి కాంగ్రెస్ చేస్తున్న ఈ కుట్రలను ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. న్యాయస్థానాలపైన తమకు సంపూర్ణ నమ్మకం ఉందన్న కేటీఆర్.. అక్కడ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. బెదిరింపులు, కేసులు తమకు కొత్త కాదని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎన్ని పోరాటాల–కైనా, ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమేనని స్పష్టంచేశారు.

# కాళేశ్వరం అవినీతికి బీఆర్ఎస్‌దే బాధ్యత

- సీబీఐ విచారణకు ముందు నుంచే బీజేపీ డిమాండ్
- ఆలస్యంగా అయినా స్పందించిన ప్రభుత్వం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్య
- 22 నెలల పాటు నిర్లక్ష్యం : లక్ష్మణ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి బీఆర్ఎస్ బాధ్యత వహించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. కాళేశ్వరంపై బీజేపీ వైఖరే నిజమని మరోసారి రుజువైందని అన్నారు. బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం అవినీతిపై బీజేపీ సిబిఐ విచారణను కోరిందని, కాంగ్రెస్ మాత్రం బిఆర్ఎస్‌ను కాపాడుతూ ఆలస్యం చేసిందని విమర్శించారు. నిజానికి తలవంచి సిబిఐకి ఫోన్ ట్యాపింగ్ కేసు అప్పగింతకు అంగికరించారని, తెలంగాణ ప్రభుత్వం వెంటనే సిబిఐకి లేఖ ఇవ్వాలని బండి సూచించారు. గతంలో ఒఆర్ఆర్ టోల్ –టెండర్లపై కాంగ్రెస్ సిట్‌ను ప్రకటించిందని, అది నేటికి ఆచరణ రూపంలోకి రాలేదని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం డైలీ సీరియల్ లా కొనసాగుతోందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీజేపీ వైఖరే నిజమని మరోసారి రుజువైందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఉద్ఘాటించారు. కాళేశ్వరం అవినీతికి బీఆర్ఎస్ పూర్తి బాధ్యత వహించాలని కోరారు. కాళేశ్వరం అవినీతికి ముమ్మాటికీ బీఆర్ఎస్ కారణమని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతిపై బీజేపీ సీబీఐ విచారణను తొలిసారిగా కోరిందని గుర్తుచేశారు బండి సంజయ్ కుమార్. కాంగ్రెస్ మాత్రం బీఆర్ఎస్‌ను కాపాడుతూ ఆలస్యం చేసిందని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే సీబీఐకి లేఖ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 22 నెలలు రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం చేసిందని.. తీరా ఇప్పుడు సీబీఐకి ఇచ్చారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. కాళేశ్వరం కేసు సీబీఐకి ఇవ్వాలని మొదటి నుంచి బీజేపీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో ఎంపీ లక్ష్మణ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి ఆధారాలతో సీబీఐకి సహకరించాలని సూచించారు. తెలంగాణ ప్రజల ధనాన్ని బీఆర్ఎస్ నేతలు మెక్కినదంతా కక్కించాలని హెచ్చరించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ కాళేశ్వరం అవినీతిలో లేరనే విషయాన్ని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగబద్ధ సంస్థలపై గౌరవం లేకుండా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడతారని ధ్వజమెత్తారు. ఎన్నికల కమిషన్‌పై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు సరికాదని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. కేసీఆర్‌తో రేవంత్ కుమ్మక్కు వలనే సీబీఐ విచారణను ఆలస్యం చేశారని ఆరోపించారు. విధిలేని పరిస్థితుల్లోనే రేవంత్ రెడ్డి.. కాళేశ్వరాన్ని సీబీఐకు అప్పగించారని చెప్పుకొచ్చారు. 22నెలలు ఎందుకు ఆలస్యం చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలిని నిలదీశారు. సీబీఐ విచారణపై మాజీ సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించటం లేదు? అని ప్రశ్నించారు. గుమ్మడికాయల దొంగ అంటే.. కేటీఆర్ భుజాలు తడుముకుంటు–న్నారని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు అహం తగ్గలేదని.. ప్రజలు ఓడించినా బుద్ధి రావటం లేదని విమర్శించారు. కాళేశ్వరం అవినీతిపై అన్ని ఆధారాలున్నాయని పీసీసీ హోదాలో రేవంత్ అన్నారని గుర్తుచేశారు. అన్ని ఆధారాలను రేవంత్ రెడ్డి సీబీఐకు ఇవ్వాలని సూచించారు. తెలంగాణ సంపను దోచుకున్న వారిని ఖచ్చితంగా శిక్షించాలని హెచ్చరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై మాట్లాడే అర్హత కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు లేదని తెలిపారు.

# వారు కోరినట్లే సీబీఐ విచారణ

## నిజాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత బీజేపీదే

## టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిన మాట వాస్తవమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణలో 90 శాతానికి పైగా ప్రజలు దీన్ని నమ్మినందుకే భారత రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని గద్దెదించారని చెప్పారు. శాసన మండలి మీడియా పాయింట్ వద్ద మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగినందునే విచారణను సీబీఐకి అప్పగించాం. కాళేశ్వరం అంశంపై మాట్లాడలేకే కేసీఆర్ మొహం చాటేశారు. బీసీ బిల్లు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పోరాడుతోంది. భాజపా, భారత రాష్ట్ర సమితి పార్టీలు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం. మండలిలో బీసీ బిల్లు ఆమోదం పొందకుండా చేసేందుకు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీలు నానా హంగామా చేశారు. బీజేపీ తరహాలోనే ఆ పార్టీ కూడా బీసీలకు వ్యతిరేకంగా పనిచేస్తోందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. మాజీ సీఎం కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేశారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ కెసిఆర్ కుటుంబ అవినీతిని బయట పెట్టిందని అన్నారు. బీజేపీ డిమాండ్ చేసినట్టే కాళేశ్వరంపై విచారణ సిబిఐకి అప్పగించామని, కాళేశ్వరంపై సిబిఐ విచారణ పూర్తి చేసి బీజేపీ నిబద్ధత చాటుకోవాలని సూచించారు. 42 శాతం బిసి రిజర్వేషన్లను బీఆర్ఎస్ అడ్డుకునే ప్రయత్నం చేసిందని మండిపడ్డారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిన మాట వాస్తవం కాదా? అని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ అవినీతిని ప్రజలు నమ్మారు కాబట్టే వారిని గద్దె దించారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# కేసీఆర్ వెనక గోతులు తవ్వేది ఆ ఇద్దరే



- హరీష్ రావు, సంతోష్ వెనక సీఎం రేవంత్ హస్తం
- కాళేశ్వరం కుట్రల వెనక ప్రధాన సూత్రధాని హరీష్‌రావు
- కేసీఆర్‌ను అడ్డంపెట్టుకుని వారు భారీగా ఆస్తులు కూడబెట్టారు
- ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్లే ఆయనకు చెడ్డపేరు వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్‌ను బద్నాం చేసే పనిలో హరీష్ రావు, సంతోష్ పాత్ర ఉందని, వారి వెనక సీఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలం ఉందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అందులో ఐదేళ్లపాటు ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు పాత్ర లేదా అని సూటిగా ప్రశ్నించారు. మాజీ ఎంపీ సంతోష్, హరీశ్‌రావు వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు వచ్చిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. కాళేశ్వరంలో చిన్నభాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయినట్లు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ జనం కోసం పని చేస్తే.. వాళ్లు ఆస్తుల పెంపుకోసం పని చేశారు. హరీశ్‌రావు, సంతోష్ నాపై ఎన్నో సార్లు కుట్రలు చేశారు. అయినా నేను నోరు మెదపలేదు. ఈ రోజు కేసీఆర్ బిడ్డగా నేను ఎంతో బాధపడుతున్నా. హరీశ్‌రావు, సంతోష్ వెనుక రేవంత్‌రెడ్డి ఉన్నారు. వారి మధ్య లోపాయకారి ఒప్పందం కుదిరింది. హరీశ్‌రావు, సంతోష్‌ను రేవంత్ రెడ్డి ఏమీ అనరు. నా తండ్రిపైనే బాణం వేస్తారు. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏంటి? లేకపోతే ఏంటి? ఇది నా తండ్రి పరువునకు సంబంధించింది. నా లేఖ బయటకు వచ్చినా నేను ఎవరి పేర్లు బయటపెట్టలేదు. రేవంత్‌రెడ్డి ప్రీ–ప్లాన్డ్‌గా సీబీఐ దర్యాప్తుకు ఆదేశించారని అన్నారు. కేసీఆర్ హిమాలయ పర్వతం లాంటి వారు. ఆయనకు అవినీతి మరక అంటితే బాధగా ఉంది. నాకు పెళ్లి చేసేందుకు కూడా మా నాన్న ఆర్థిక ఇబ్బంది పడ్డారు. దేవుడి లాంటి నా తండ్రిపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశిస్తే నాకు బాధగా ఉండదా? కేసీఆర్‌ని నిన్న అన్ని మాటలు అంటుంటే, ఒక్కరు కూడా నోరు విప్పకపోవడం ఏంటి? రేవంత్.. మీకు దమ్ముంటే.. లోపాయకారీ ఒప్పందం లేకపోతే నేను పేర్లు కూడా చెప్పా.. చర్యలు తీసుకోండని సవాల్ చేశారు. ఆ ఇద్దరు, ముగ్గురు నేతలే కేసీఆర్‌పై కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో హరీష్‌రావు, సంతోష్‌ది కీలకపాత్ర అని వెల్లడించారు. వీరిద్దరి వెనక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని.. వారిని కాపాడుతున్నారని ఆరోపించారు. నేనిప్పుడు మాట్లాడితే నా వెనుక ఎవరో ఉన్నారంటారని.. కానీ, అవినీతి అనకొండల మధ్య కేసీఆర్ బలిపశువు అవుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో నాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు బాధ్యుణ్ణి చేస్తూ రేవంత్ ప్రభుత్వం మా నాన్నపై సీబీఐ విచారణ వేసింది. నా కడుపు మండిపోతోంది. మా నాన్నకు డబ్బు, తిండిపై ఏనాడూ యావ లేదు. మా నాన్న పరువు పోతే మాకు బాధ.. వాళ్లకు ఏం లేదు. కాళేశ్వరం అవినీతిలో హరీష్‌రావుది మేజర్ పాత్ర. అవినీతి అనకొండల మధ్య కేసీఆర్ బలిపశువు అవుతున్నారని మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత కంటతడి పెట్టుకున్నారు. బీసీల రిజర్వేషన్లపైనా బిల్ పెడతారు. కానీ, ఎందుకు సుప్రీం కోర్టు దాకా వెళ్లి పోరాడటం లేదు. బిహార్ కోసం తెలంగాణ బీసీ బిడ్డలను రేవంత్ బలి చేస్తున్నారు. తెలంగాణ జాగృతి నుంచి బిహార్ వెళ్లి మీ బండారం బయటపెడతాం. సీబీఐ కాదు, ఇంకే విచారణ వేసినా కేసీఆర్ కడిగిన ముత్యంలా వస్తారని ధీమా వ్యక్తం చేశారు.



# బీసీ బిల్లుకు ఆమోదం తెలపండి

గవర్నర్‌ను కోరిన అఖిలపక్షం నేతలు ● అసెంబ్లీ ఆమోదంపై వివరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంత్రులు, ఎమ్మెల్యేలు సోమవారం రాజ్ భవన్‌లో కలిశారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లు ఆమోదం కోసం వినతి పత్రం ఇచ్చారు. అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లుపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, మహేష్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, సీపీఐ నారాయణ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కలిశారు. గర్నవర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీకి బీజేపీ నేతలు ఎవరూ హాజరుకాలేదు.అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఫ్యూడలిస్ట్ పార్టీ అని విమర్శించారు. బీసీల అంశం చర్చకు వస్తే ఇలా అడ్డుపడటం సరికాదని చెప్పుకొచ్చారు. సమాజం గమనిస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కి బీసీల పట్ల ఉన్న గౌరవం, వైఖరి స్పష్టం అవుతోందని చెప్పుకొచ్చారు. 42శాతం రిజర్వేషన్లను అడ్డుకోవద్దని సూచించారు మంత్రి పొన్నం ప్రభాకర్. కులగణన సర్వేలో కూడా బీఆర్ఎస్ నేతలు ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. కడుపులో కత్తులు పెట్టుకొని మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లకు బీఆర్ఎస్ మద్దతు తెలపాలని కోరారు. బీసీ బిల్లు అడ్డుకోవడం ఏం పద్ధతని నిలదీశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి బీసీ రిజర్వేషన్‌లు ఇష్టం లేకపోవచ్చని చెప్పుకొచ్చారు. బీసీ రిజర్వేషన్‌లను అడ్డుకునే కుట్ర దౌర్భాగ్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై ఏకగ్రీవ తీర్మానం చేయడం మంచి పరిణామమని సీపీఐ నేత నారాయణ అన్నారు. మరోవైపు సభలో కాళేశ్వరంపై చర్చ జరుగుతుంటే పదేళ్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ అసెంబ్లీకి గైర్హాజరు కావడంపై ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే కేసీఆర్ తన అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం

అధికారులతో సిఎం రేవంత్ సమీక్ష ● అప్రమత్తంగా ఉండాలని ఆదేశం



**హైదరాబాద్,సెప్టెంబర్1:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సిఎం రేంవత్ రెడ్డి మరోమారు అధికారులను అప్రమత్తం చేశారు. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే ఛాన్స్ ఉందన్న నేపథ్యంలో అప్రమత్తం చేశారు. అలాగే ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద నీటితో నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వర్షాలు, వరదల నష్టంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో సమీక్షించారు. వర్షాల కారణంగా 1,052 చోట్ల 1,023 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని సీఎం దృష్టికి ఉన్నతాధికారులు తీసుకువెళ్లారు. దీనిపై సమగ్ర నివేదిక అందజేయాలని వారిని ఆదేశించారు. అలాగే గతేడాది భారీ వర్షాలకు జరిగిన నష్టానికి సంబంధించి కేంద్రం నుంచి నిధులు రాక పోవడంపై సీఎం ఆరా తీశారు. ఈ అంశాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాలని ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. ఇక భారీ వర్షాల సమయంలో చెరువులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని చెరువుల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేయాలని చెప్పారు. ఇప్పటి వరకు విపత్తు నిర్వహణ నిధుల కింద చేపట్టిన పనుల వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్లను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట నష్టం అంచనా వేసి తక్షణమే నివేదిక సైతం అందజేయాలని సూచించారు. గత ఏడాది ఏర్పాటు– చేసిన ఎస్డీఆర్ఎఫ్.. వరదల సమయంలో బాగా పని చేసిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో ఎన్డీఆర్ఎఫ్‌తో పని లేకుండా ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిలో నైపుణ్యాలు పెంచాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా ఉన్నతాధి కారులకు సీఎం వివరించారు. హెచ్ఎండీఏ పరిదిలో చెరువులను వెంటనే నోటిఫై జరగాలని ఆదేశించారు. అయితే వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం అందజేయాలని అధికారులకు సూచించారు. అలాగే చనిపోయిన జంతువులకు సైతం పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిందేనని ఈ సందర్భంగా కలెక్టర్లకు స్పష్టం చేశారు. కింద స్థాయి అధికారులు కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్లు, ఎస్పీలు జిల్లాలోనే ఉండి నిరంతరం అప్రమత్తంగా ఉండి.. పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. మరికొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై సమగ్ర నివేదిక తయారు చేసి కేంద్రానికి అందజేయాల్సి ఉందని అధికారులకు తెలిపారు.

# మహబూబ్‌నగర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం

## కంటెయినర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

## ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 1:** మహబూబ్‌నగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. సోమవారం తెల్లవారుజామున అడ్డాకుల మండలం కాటావరం స్టేజి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కంటెయినర్ లారీని ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా.. ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. బస్సు హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులను అష్రస్ ఉన్నిసా (70), హసన్ (35), ఎల్లమ్మ (45)గా గుర్తించారు. క్షతగాత్రులను 108 వాహనంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 31 మంది ప్రయాణికులు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు– అడ్డాకుల ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

సంపాదకీయం



# అవినీతి నిర్ణయాలపై నిగ్గు తేల్చాల్సిందే!

కాళేశ్వరం బ్యారేజీల్లో అక్రమాలు, వైఫల్యాలపై మరింత లోతుగా దర్యాప్తు చేయడానికి సీబీఐకి కేసు అప్పగించాలని శాసనసభ నిర్ణయించడం ఆహ్వానించదగ్గ విషయం. ఓరకంగా ఇది 20 నెలల క్రితమే నిర్ణయం తీసుకోవాల్సిన విషయం. ఆలస్యంగా అయినా అవినీతిపై చర్యలకు సర్కార్ పూనుకుంది. నిజానికి సిబిఐపైన కూడా విశ్వాసం సన్నగిల్లుతోంది. ఏ కేసులోనూ నిక్కచ్చిగా విచారణ చేయలేకపోతోంది. ఎపిలో వైఎస్ వివేకా హత్య కేసును ఐదేళ్లు దర్యాప్తుచేసినా తేల్చలేకపోయింది. జగన్ అవినీతి వ్యవహారాల్లో కూడా విచారణ జరగాలి. నిజానికి రాష్ట్ర విబజన తరవాత తెలంగాణ, ఎపిలుఎందుకు అప్పుల్లో కూరుకు పోయాయో, అందుకు ఏయే నిర్ణయాలు అక్రమమో తేల్చి ఆనా టి పాలకులపై ప్రత్యేక విచారణ కమిషన్‌లు వేయాలి. జగన్, కెసిఆర్ పాలనపై సమగ్ర దర్యాప్తు జరిపి, భవిష్యత్‌లో ఇలాంటి పాలకులు రాకుండా ఉండేలా కఠిన చర్యలకు పూనుకోవాలి. మరోవైపు సిబిఐ వ్యవహారాల్లో కేంద్రం తలదూర్చడం వల్ల కూడా దాని ప్రతిష్ట మంటకలుస్తోంది. ఇకపోతే రాజకీయ అవినీతి కేసుల విచారణకు సిబిఐ విచారణలు సరిపోవు. లోక్‌పాల్ వ్యవస్థ రావాల్సి ఉంది. దేశంలో రాజకీయ అవినీతి బాగా వేళ్లూను కుంది. రాజకీయ నాయకులు పాలనను పక్కన పెట్టి అవినీతిలో మునిగి తేలుతున్నారు. ఇందుకోసం స్వతంత్ర దర్యాప్తు సంస్థ ఉండాల్సిందే. మోడీ ప్రభుత్వం ఈ విషయంలో నిబద్ధతను చాటుకుని సర్వ స్వతంత్ర న్యాయవ్యవస్తకు శ్రీకారం చుట్టాలి. కేవలం రాజకీయ అవినీతిని విచారించేందుకు దీని అవసరం చాలావుంది. ఇకపోతే కాళేశ్వరం నిర్మాణమే పెద్ద డొల్ల. అదికేవలం కమీషన్ల కోసం, కెసిఆర్ తన ఎర్రవల్లి పొలం పారించుకునేందుకు కట్టిన కట్టడం తప్ప ప్రజలకు ఉపయోగపడే కట్టడం కాదు. నిపుణుల సూచనలు బేఖాతర్ చేస్తూ కట్టిన కట్టడం అది. అది అవినీతి కట్టడం కాకుంటే...కెసిఆర్ నిజాయితీ పరుడైతే కాళ్వేరం కమిషన్‌ను వ్యతిరేకించరు. హైకోర్టుకు వెళ్లి కమిషన్‌ను రద్దు చేయమని కోరరు. ఆందోళనలు చేయాలని పిలుపునివ్వరు. దాదాపు పదేళ్లు పాలించిన కెసిఆర్ కుటుంబం తెలంగాణను అప్పులకుప్పగా చేసి కుటుంబపాలనతో భ్రష్టు పట్టించింది. ఈ క్రమంలో దీనిపై సిబిఐ విచారణను స్వాగతించాల్సిన అవసరం ఉంది. ఆదివారం శాసనసభలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై జరిగిన చర్చకు సమాధానమిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించడం మంచి నిర్ణయంగా చూడాలి. ప్రాజెక్టులో అక్రమాలపై ఇప్పటివరకు నివేదికలు ఇచ్చిన ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్, కాగ్, జస్టిస్ ఘోష్ కమిషన్.. గత ప్రభుత్వాన్ని, నాటి ప్రభుత్వ పెద్దల్ని తప్పుపట్టాయి. తమ పరిధిలో ఉన్న ఏ సంస్థ దర్యాప్తు చేసినా తమ చిత్తశుద్ధిని శంకిస్తారని, అందుకే శషభిషలకు తావు లేకుండా కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు- ప్రకటిం చారు. నిజానికి కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ చేసిన మోసం అంతాఇంతా కాదు. దీంతో తెలంగాణ ప్రజల సొమ్ము రూ.లక్ష కోట్లు కొల్లగొట్టారు. ఏఐబీపీ కింద ఏదైనా ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తే 75 శాతం నిధులిచ్చే నిబంధన ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో 25 ప్రాజెక్టులను ఈ పథకం కింద కేంద్రం గుర్తించింది. ఆ జాబితాలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కూడా ఉంది. ఆ ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో మేడిగడ్డకు మార్చడం తోనే అవినీతికి తెరలేపారు. కాళేశ్వరం ప్రాజెక్టును రాష్ట్రానికి గుదిబండగా మార్చిన కేసీఆర్, హరీశ్‌రావును శిక్షించాల్సిన అవసరం ఉంది. రాజకీయ నాయకులు తమ ఇష్టాను సారం కట్టడాలను కట్టి డబ్బులు వెనకేసుకోవడం అలవాటుగా చేసుకున్నారు. ఎపిలో జగన్ కూడా ఇలాగే భీమిలి బీచ్‌లో రాజప్రాసాదాలను కట్టుకున్నారు. నిజానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఆకృతి, నిర్మాణం, నిర్వహణ అన్నవి ఓదావరి జలా లను ఉపయోగించాలన్న ప్రాతిపదికగా సాగలేదు. ప్రాజెక్టు వైఫల్యం గురించి ఎన్‌డీఎస్‌ఏ ఇప్పటికే తేల్చిచెప్పింది. ఎన్‌డీఎస్‌ఏ నివేదికను ఎన్ డీయే రిపోర్టని బిఆర్‌ఎస్ ఎదురుదాడికి దిగింది. ఒకవేళ ఇది అవినీతి ప్రాజెక్ట్ కాకుంటే మేడిగడ్డ కూలిపోవడం ఎందుకు జరిగిందన్నది ప్రశ్న. అలాగే దీనితో ఉపయోగం లేదని తేలింది కూడా. ఇది ఉపయోగకర ప్రాజెక్ట్ అయితే ఎందుకు బిఆర్‌ఎస్ తప్పుడు విధానాలతో ఎదురుదాడికి దిగుతుందో చెప్పలేకపోతోంది. మొత్తంగా గోదావరిలో రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయి. దీనిపై విచారణ చేయించి లోపాలు ఎత్తిచూపిస్తే అడ్డుకుంటున్న తీరు బిఆర్‌ఎస్ అవినీతిని తేటతెల్లం చేస్తోంది. పిసి ఘోష్ కమిషన్ నివేదికలో ఏమైనా లోపా లుంటే వాటిని ప్రస్తావించ కుండా జస్టిస్ ఘోష్‌పై విమర్శలు చేయడం బిఆర్‌ఎస్ నేతల కక్కుర్తి రాజకీయం తప్ప మరోటి కాదు. నిజానికి తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించుకునేందుకు మహారాష్ట్ర అంగీకరించింది. అక్కడ ప్రాజెక్టు నిర్మిం చుకోవచ్చని వాప్కోస్ చెప్పింది. అక్కడ 205 టీఎంసీల లభ్యత ఉందని అప్పటి కేంద్ర జలవనరులశాఖ మంత్రి ఉమాభారతి ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇవేమీ కాదని... మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టి మూడు లిఫ్టుల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు వీలుగా నివేదిక ఇవ్వాలని ఆ సంస్థను అడిగారు. 2015లో రీడిజైన్ పేరిట కేసీఆర్ పెద్ద ఎత్తున అవినీతికి తెరలేపారు. ప్రాణహిత కాదని చేపట్టిన కాళేశ్వరంతో మూడు బ్యారేజీల నిర్మాణంతో విద్యుత్తు వినియోగం 3వేల మెగావాట్ల నుంచి 8,450 మెగావాట్లకు పెరిగింది రూ.38 వేల కోట్ల ప్రాజెక్టు వ్యయం.. కాళేశ్వరం రీడిజైన్ కారణంగా రూ.1.47లక్షల కోట్లకు చేరింది. ఇది అవినీతికి పరాకష్ట అని లెక్కలు తెలియ చేస్తున్నాయి. అవినీతిపై ప్రపంచమంతా కోడై కూస్తున్నా కెటిఆర్, మరీస్ రావులు ఎదురుదాడి విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ తెచ్చానని డాంబికాలు పలుకుతున్న పెద్ద మనిషి అసంబ్లీకి కరావడం లేదు. జస్టిస్ ఘోష్ కమిషన్ తమకు 8బీ, 8సీ నోటీసులు ఇవ్వలేదని.. అందుకే కమిషన్ నివేదిక చెల్లదని కేసీఆర్, హరీశ్‌రావు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విద్యుత్తు కొనుగోళ్లలో అక్రమాలపై జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ ఇవే నోటీసులిస్తే.. అలా ఇవ్వడం చెల్లదంటూ కూడా కేసీఆర్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పుడు జస్టిస్ ఘోష్ కమిషన్ అవే నోటీసులివ్వలేదని వితండవాదం చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నిజానికి ఇలాంటి అక్రమాలకు పాల్పడినవారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. రాష్ట్ర విభజన తరవాత విపరీతమైన అవినీతి, అక్రమాలకు పాల్పడిన కెసిఆర్, జగన్‌లపై ప్రత్యే విచారణ కమిషన్ వేయాలి. వారి పాలన నాటి నిర్ణయాలను సమీక్షించాలి. ఇందుకు బాధ్యులైన ఇరువురు నేతలను, అందుకు సహకరించిన నేతలను, అధికారలును జైళ్లల్లో వేయాలి. ఈ కేసులను త్వరగా తేల్చి సమాజానికి ఓ మంచి సందేశం ఇవ్వాలి.

# రష్యా చమురుతో భారత్ వ్యాపారం

- పరోక్షంగా రష్యాకు భారత్ సహకారం
- మరోమారు నోరు పారేసుకున్న నవారో




**వాషింగ్టన్, సెప్టెంబర్ 1:** అమెరికా రోజురోజుకూ భారతదేశంపై ఒత్తిడిని పెంచేందుకు ప్రయత్నిస్తోంది. ఒకపక్క రష్యా, చైనా వంటి దేశాలతో స్నేహం చేసేందుకు మోడీ చేస్తున్న ప్రయత్నాలు అమెరికాకు అస్సలు మింగుడు బడటం లేదు. భారత్ ఒక చిన్న ప్లేయర్ కాదని దానిని జాగ్రత్తగా డీల్ చేయాలంటూ చాలా మంది సూచిస్తున్నప్పటికీ అమెరికా అధికార వర్గాలు మాత్రం తమ ఆరోపణలను ముమ్మరం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కేవలం వారం రోజుల్లో రెండోసారి యూఎస్ వైట్ హౌస్ ట్రేడ్ అడ్వైజర్ పీటర్ నవారో ఇండియాపై అటాక్ చేశారు. ఈసారి ఆయన భారత్ రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ కొనుగోళ్లను 'బ్రాహ్మిన్స్ ప్రాఫిటరింగ్..' అంటూ సంచలన కామెంట్స్ చేశారు. భారతదేశంలోని ప్రజల ప్రయోజనాల కంటే ప్రభుత్వానికి సంపన్న వర్గాల లాభాలే ముఖ్యమయ్యాయి అంటూ నవారో సూటిగా మోడీ ప్రభుత్వాన్ని నింధించారు. రష్యా నుంచి తక్కువ రేటు-కు వస్తున్న క్రూడ్ ఆయిల్ కొంటున్న భారతదేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు- రిఫైనరీలు.. వాటిని శుద్ధి చేసి పెట్రోల్, డీజిల్ సహా ఇతర పెట్రోలియం ఉత్పత్తులుగా మార్చు యూరప్, ఆఫ్రికా, ఆసియా మార్కెట్లకు అధిక ధరకు అమ్ముతూ పెద్ద లాభాలు పొందుతున్నారని పీటర్ నవారో పేర్కొన్నారు. దీనివల్ల భారతదేశంలోని సంపన్న కుటుంబాలు, ముఖ్యమైన బిజినెస్ ఫ్యామిలీలకు లాభపడుతున్నాయే తప్ప సగటు- భారతీయుడికి ఎలాంటి తగ్గింపు ప్రయోజనం దక్కటం లేదని నవారో అన్నారు. ఈ పద్ధతిలో ఇప్పటికే భారత సంపన్న వ్యాపార వర్గాలు దాదాపు 16 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలు లక్ష 36వేల కోట్ల రూపాయలకు పైగా లాభాలను తమ జేబులో వేసుకున్నాయని ఆరోపించారు. భారత్ రష్యా చమురు వ్యాపారానికి ఒక ప్రాసెసింగ్ కేంద్రంగా మారిందంటూ కామెంట్ చేశారు. దీనికి అర్థం రష్యా క్రూడాయిల్ ఇండియాలో రిఫైన్ చేయబడి ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాలకు ఎగుమతి అవుతోందని.. దీని వల్ల పరోక్షంగా రష్యా ఆర్థికంగా యుద్ధం వల్ల దెబ్బతినకుండా అవసరమైన నిధులను సమకూర్చుకుంటోందని నవారో అభిప్రాయపడ్డారు. ఇండియా చేస్తున్న ఈ బిజినెస్ వల్ల రష్యా యుద్ధం మరింత కాలం కొనసాగించటానికి, తనను తాను ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి ఉపయోగపడుతోందన్నారు. ఈ చర్యలు అమెరికా, యూరోపియన్ దేశాలపై అదనపు భారాన్ని కలిగిస్తున్నాయని, తమ దేశంలోని ప్రజలు యుద్ధ భారాన్ని మోయాల్సి వస్తోందని చురకలు అంటించారు. ఈ క్రమంలో అమెరికా భారతదేశంపై 50 శాతం సుంకాలు విధించటం సరైనదేనని సమర్థించారు. అయితే నవారో లేదా అమెరికా ప్రభుత్వం రష్యా చమురు కొనుగోళ్లపై చేస్తున్న ఆరోపణలను భారత్ కూడీ తీవ్రంగానే తిప్పికొడుతోంది. మీకు భారత్ నుంచి ఇంధనం, రిఫైన్స్ ఉత్పత్తులు కొనటం ఇబ్బందిగా ఉంటే మానుకోమని యూరప్, అమెరికాకు సూటిగా చెప్పేశారు భారత విదేశాంగ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్. ఇష్టం లేనప్పుడు వదిలేయచ్చుగా అంటూ యూఎస్, యూరప్ తీరుపై కామెంట్ చేశారు. అయితే భారతదేశంలోని రాజకీయ విశ్లేషకులు నవారో కామెంట్స్ తొందరపాటు- వ్యాఖ్యలంటూ ఖండిస్తున్నారు. ఈ పరిస్థితులు యూఎస్ భారత్ స్నేహబంధానికి బీటలు వారేలా చేస్తున్నాయని అంటున్నారు.



# ప్రమాదంలో భారత ఎన్నికల ప్రక్రియ

**ఎన్నికల సంఘం అత్యున్నతమైన వ్యవస్థ**

**నేను ఏ పార్టీకి చెందిన వ్యక్తిని కాదు**

**గతంలో తన తీర్పులను సమర్థించుకున్న జస్టిస్ సుదర్శన్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** భారతదేశంలో ఎన్నికల పక్రియ ప్రమాదంలో పడబోతోందని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల సంఘం అత్యున్నతమైన వ్యవస్థ అని ఉద్ఘాటించారు. సోమవారం తాజ్ కృష్ణాలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలతో జస్టిస్ సుదర్శన్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. తాను ఇండియా కూటమి అభ్యర్థిని కాదని.. ప్రతిపక్షాల అభ్యర్థినని సుదర్శన్ రెడ్డి నొక్కిచెప్పారు. తాను ఏ పార్టీ సభ్యత్వం స్వీకరించనని స్పష్టం చేశారు. తనపై ఏవేవో ముద్రలు వేస్తున్నారని... అస్సలు బాధగా లేదని చెప్పుకొచ్చారు. తనపై విమర్శలు చేస్తే ఉప రాష్ట్రపతి ఎన్నికల పోటీ నుంచి వెనక్కు తగ్గనని తెలిపారు. తనను విమర్శిస్తే ఈ ఎన్నికల పోటీ- నుంచి వెనక్కు తగ్గి సైలెంట్ అయిపోతానని కొంతమంది అనుకు న్నారని పేర్కొన్నారు. తనను విమర్శించే వారు తాను ఇచ్చిన తీర్పు ఒక్కసారి చదవాలని సూచించారు. కోర్టు తీర్పుల గురించి మాట్లాడేవారు వాటిని చదివి మాట్లాడాలని కోరారు. అది తన తీర్పు కాదని.. కోర్టు తీర్పు అని ఉద్ఘాటించారు. తన తీర్పును 11 మంది న్యాయమూర్తులు చదివారని... అందులో ఒక్క విషయాన్ని కూడా మార్చలేకపోయారని సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సల్వా జుడంపై తీర్పు సందర్భంగా హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను దృష్టిలో పెట్టుకుని ఆయన మాట్లాడారు. రాజ్యాంగ వ్యవస్థలు మసకబారుతున్న సందర్భంలో ప్రతి ఒక్కరూ మాట్లాడాల్సిన అవసరముందన్నారు. ఓటు- వేసే ప్రతి పౌరుడు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయ అభిప్రాయాన్ని కలిగి ఉంటారని అన్నారు. నేను ప్రతి ఎన్నికల్లో పాల్గొని నా ఓటు- హక్కు వినియోగించుకున్నాను. పౌరహక్కులు, సామాజిక న్యాయం, ఆదేశిక సూత్రాల గురించి నేను మాట్లాడుతాను. రాజకీయ ముళ్లకిరీటం ఎందుకు నెత్తిన పెట్టుకున్నారని కొందరూ అడుగుతున్నారు. వాళ్లందరికీ రాజ్యాంగాన్ని పట్టుకొని సమాధానం చెబుతున్నాను. ఉప రాష్ట్రపతి పదవి రాజకీయపరమైన పదవి కాదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఐదుసార్లు రాజ్యాంగంపై నేను ప్రమాణం చేశాను. రాజ్యాంగానికి లోబడి ఉండటమే కాదు, కాపాడటం నా బాధ్యతని, ఆదేశిక సూత్రాలను పాటించే వ్యక్తిని నేను అని అన్నారు. ఈ దేశంలోని ప్రజలు ముందు ఓటర్లు, తర్వాతనే పౌరులు అయ్యారు. ఓటరు లిస్ట్ చిత్తు కాగితం అని కొంతమంది అనుకుంటున్నారు. మాకు ఇష్టం ఉన్న వారి పేరు రాస్తాం, ఇష్టం లేని వాళ్ల పేర్లు రాయమంటే ఎలా అని ప్రశ్నించారు. మెజారిటీ ఉంది చట్టం చేస్తాం అంటే ఎలా..?. రాజ్యాంగం మంచి వాళ్ల చేతుల్లో ఉన్నంత వరకే దానికి రక్షణ అని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

# స్థానికత అంశంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

**9నుంచి 12 తరగతులు చదివితేనే లోకల్‌గా పరిగణింపు**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్1:** స్థానికత అంశంపై సుప్రీంకోర్ట్ సంచలన తీర్పునిచ్చింది. తెలంగాణలో వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థులకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను సమర్థించింది. గతంలో తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులు పక్కన పెడుతూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించింది. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదవాల్సిందేనన్న నిబంధనను అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. తెలంగాణలో వరుసగా 9 ,10, 11,12 తరగతులు చదువితేనే లోకల్ అంటూ స్పష్టం చేసింది. అయితే ఈ రూల్స్ లో ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఉంటు-ందనే షరతు పెట్టింది సుప్రీం కోర్ట్. లోకల్ రిజర్వేషన్ అంశంపై తెలంగాణకు ఊరట కలిగించేలా సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. వరుసగా నాలుగేళ్లు అంటే 9వ, 10వ, 11వ, 12వ తరగతులు తెలంగాణలో చదివితేనే స్థానికుడిగా పరిగణించాలని స్పష్టంచేసింది. అయితే, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. స్థానికత అంశంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 33కి అత్యున్నత న్యాయస్థానం పూర్తి స్థాయి మద్దతు తెలిపింది. తెలంగాణలో స్థానిక రిజర్వేషన్ల అంశం ఎప్పటి నుంచో వివాదాస్పదంగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 33 ప్రకారం ఇంటర్మీడియట్‌కు ముందు వరుసగా నాలుగేళ్లు చదివిన విద్యార్థులనే స్థానికులుగా పరిగణించాలని స్పష్టం చేసింది. కానీ, కొందరు విద్యార్థులు దీన్ని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రతి రాష్ట్రం తన స్థానిక రిజర్వేషన్ల కోసం తగిన నిబంధనలు రూపొందించుకునే అధికారం ఉందని సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్రం వాదనలు వినిపించింది. అయితే రాష్ట్ర విభజన తర్వాత తమ పిల్లలు మరో రాష్ట్రంలో చదవాల్సి వచ్చిందని అభ్యర్థుల తరపున వాదనలు వినిపించారు పిటిషనర్లు. అయితే ఇప్పటికే రాష్ట్రంలో లోకల్ కోటా పై జీవో 33 ను అమలు చేస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు విన్నవించింది. అయితే ప్రభుత్వ ఉద్యోగులు తప్పని పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల్లో పని చేస్తున్నారని..దాంతో వాళ్ళ పిల్లలకు జీవో 33 నుంచి మినహాయింపు ఇస్తామని ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. రాష్ట్రప్రభుత్వం చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకున్న సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బి ఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు వెల్లడించింది. అయితే గతేడాది హైకోర్ట్ ఇచ్చిన తాత్కాలిక మినహాయింపుతో స్థానిక కోటా కింద ప్రయోజనం పొందిన విద్యార్థులు తమ ప్రయోజనాలను కొనసాగించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇకపై ఎంబీబీఎస్, బీడీఎస్ యూజీ కోర్సులలో జీవో 33 ప్రకారమే స్థానిక కోటా రిజర్వేషన్లు అమలుకానున్నాయి. అయితే ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రమే జీవో 33 నుంచి మినహాయింపు ఇస్తామనడంపై ప్రైవేటు- ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము కూడా తప్పని పరిస్థితుల్లోనే రాష్ట్రాన్ని వదిలి ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తుందని తమ పిల్లల భవిష్యత్ గురించి ప్రభుత్వము కోర్టులు ఆలోచించాలని వేడుకుంటున్నారు.

# అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం

- విపత్తు కారణంగా 622 మంది మృత్యువాత
- మరో 1500 మంది వరకు క్షతగాత్రులు

**కాబూల్,సెప్టెంబర్1:** అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. పాకిస్థాన్ సరిహద్దులోని కునార్ ప్రావిన్స్‌లో రిక్టర్ స్కేల్‌పై 6.0 తీవ్రత నమోదైంది. ఈ ఘోర విపత్తు కారణంగా 622 మంది మరణించినట్లు ఆ దేశ అధికారిక మీడియా సంస్థ రేడియో టెలివిజన్ అఫ్గానిస్థాన్ వెల్లడించింది. మరో 1500 మంది వరకు గాయపడినట్లు- తెలిపింది. యూఎస్ జియోలాజికల్ సర్వే వివరాల ప్రకారం.. నంగర్హార్ ప్రావిన్స్‌లోని జలాలాబాద్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడైంది. 8కిలోమీటర్ల లోతులో అది కేంద్రీకృతమై ఉంది. ఆదివారం అర్ధరాత్రి 11.47 గంటల ప్రాంతంలో భూకంపం సంభవించినట్లు అధికారులు తెలిపారు. విపత్తు కారణంగా కునార్ ప్రావిన్స్ తీవ్రంగా ప్రభావితమైనట్లు సమాచారం. భూకంప తీవ్రతకు సంబంధించిన పలు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. భూకంపం కారణంగా పలు గ్రామాల్లోని ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయని వార్దక్



ప్రావిన్స్ మాజీ మేయర్ జరీఫా ఘఫ్ఫారీ పోస్టు పెట్టారు. 'అఫ్గానిస్థాన్‌లోని కునార్, నోరిస్థాన్, నంగర్హార్ ప్రావిన్స్‌లు భూకంపం కారణంగా తీవ్రంగా నష్టపోయాయి. ఇళ్లు కూలిపోవడంతో పలు కుటుంబాలు వీధిన పడ్డాయి. గ్రామాల్లోని మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర గాయాలపాలై ఇక్కట్లు- ఎదుర్కొంటు-న్నారు. బాధితుల పరిస్థితి దుర్భరంగా ఉంది. అసమర్థ తాలిబన్ ప్రభుత్వం ఈ విపత్తును ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా లేదు. ఈ సమయంలో కునార్ ప్రజలకు సాయం అత్యవసరం. అంతర్జాతీయ సమాజం, మానవతా సంస్థలు సత్వరమే స్పందించి బాధితులను ఆదుకోవాలి. అవసరమైన ఆహారం అందించి.. ఆశ్రయం కల్పించాలి. ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయాలి' అని పోస్టులో పేర్కొన్నారు. భూకంపం కారణంగా పలువురు మరణించారనే వార్త విని తాను చలించిపోయానని క్రికెటర్ రహ్మనుల్లా గుర్బాజ్ పోస్టు పెట్టారు. బాధితుల కుటు-ంబం కోసం ప్రార్థిస్తున్నట్లు- చెప్పారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులు సమీపంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని అంతకుముందు ఓ అధికారి తెలిపారు. 20 నిమిషాల వ్యవధి తర్వాత 4.5 తీవ్రతతో మరో భూకంపం వచ్చినట్లు- పేర్కొన్నారు.

# అసెంబ్లీకి రండి.. చర్చిద్దాం



- పెన్షన్ అనేది దానం కాదు.. ప్రభుత్వాల బాధ్యత
- తెలుగు వారికి పెన్షన్ పరిచయం చేసింది ఎన్టీఆరే
- 30 ఏళ్ల క్రితం తొలిసారిగా సీఎం అయ్యా.. ఏనాడూ విశ్రమించలేదు
- కూటమి గెలిచింది.. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చింది
- పింఛన్ల పంపిణీ, ప్రజా వేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**రాజంపేట :** ఫేక్ ప్రచారం చేయడం కాదు.. అసెంబ్లీకి వచ్చి వివిధ అంశాలపై చర్చించాలని రాజంపేట ప్రజావేదిక నుంచి సీఎం చంద్రబాబు నాయుడు వైసీపీకి సవాల్ విసిరారు. పేదలకు సేవలో కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజంపేట మండలం బోయినపల్లిలో సీఎం పర్యటించారు. కిడ్నీ పనిచేయక మంచానికే పరిమితమైన యడవల్లి సుమిత్రమ్మ ఇంటికి వెళ్లిన ముఖ్యమంత్రి ఆమెకు స్వయంగా పింఛను అందించి

ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అలాగే వివిధ పథకాల లబ్దిదారులతో మాట్లడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక సభలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అసెంబ్లీకి రాకుండా... సోషల్ మీడియాలో, ప్రెస్ మీట్లల్లో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న వైసీపీపై ముఖ్యమంత్రి విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... "మొన్నటి వరకూ సిద్ధం, సిద్ధం అని ఎగిరిపడిన 11 మంది వైసీపీ నేతలు అసెంబ్లీలో చర్చకు రావాలి. ఎవరు సంక్షేమం చేశారో, ఎవరు అభివృద్ధి చేశారో తేల్చుకుందాం. ఫేక్ ప్రచారాలతో ఎల్లకాలం ప్రజలను మోసం చేయలేరు. క్లైమోర్ మైన్లతో పేల్చినా చలించని నేను ఎవరికీ భయపడను. సూపర్ సిక్స్ పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు, పెట్టుబడులు మొదలు.. బాబాయ్ హత్య, డోర్ డెలివరీ రాజకీయాలు, కోడి కత్తి డ్రామాలు, గులకరాయి ఎపిసోడ్లు, పులివెందుల-ఒంటిమిట్ట ఎన్నికలు ఇలా దేనిపైనైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. రక్తం పారించిన సీమలో నీరు పారించే సత్తా తెలుగుదేశానిది. సీమలో ఫ్యాక్షన్ మాట వినపడకుండా చేశాం. రాష్ట్రంలో రౌడీ అన్న వాడు లేకుండా చేశాం. సొంత కార్యకర్తను కారుతో తొక్కించి.. నెపాన్ని మా మీద వేశారు. మామిడి కాయలు రోడ్డుపై తొక్కించి డ్రామాలాడినవారు మమ్మల్ని విమర్శిస్తున్నారు. మహిళలపై సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించి ఆడబిడ్డలకు భద్రత కల్పిస్తాం." అని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. "పింఛన్ల పంపిణీ దానమో, ధర్మమో కాదు. అది ప్రభుత్వాల బాధ్యత. ప్రతి నెలా పింఛన్ల పంపిణీ పండుగా జరుగుతోంది. గత ప్రభుత్వంలో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి చూశాం. లక్షా 65 వేలమంది అధికారులు కేవలం 3 గంటల్లో పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా ఎన్డీఏ ప్రభుత్వం పేదలకు పింఛన్లు అందిస్తోంది. ఇప్పటివరకూ దాదాపు రూ.42 వేల కోట్లు కేవలం పెన్షన్ల కోసం ఖర్చు చేశాం. ఈ సెప్టెంబర్ నెలలోనే పింఛన్ల కింద 63,61,380 మందికి రూ.2,747 కోట్లు వెచ్చించాం. 1983లో ఎన్టీఆర్ రూ. 30తో పేదలకు పింఛనుకు శ్రీకారం చుట్టారు. ఆ రూ. 30ని నేను 1995లో ముఖ్యమంత్రి అయ్యాక రూ. 75కు పెంచాను. 2014 నాటికి రూ.200 ఉన్న పింఛన్‌ను మళ్లీ ఒకేసారి రూ.1,000కి పెంచాం. దివ్యాంగులకు రూ.1500 చేశాం. మళ్లీ 2018లో వృద్ధాప్య, వితంతు పెన్షన్‌ను రూ.2,000లకు, దివ్యాంగులకు రూ.3,000 చేశాం. ఐదేళ్లలో పింఛన్లు 10 రెట్లు, దివ్యాంగులకు 12 రెట్లు పెంచిన పార్టీ తెలుగుదేం." అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. "గత ప్రభుత్వంలో అవయవాలు సక్రమంగా ఉన్నవారికి కూడా పింఛన్లు ఇచ్చారు. వారి పార్టీ కార్యకర్తలకు ప్రజా సంపదను దోచిపెట్టారు. ప్రభుత్వ ధనం దోపిడీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలో వద్దో ప్రజలే చెప్పాలి. భర్త చనిపోతే భార్యకు పింఛను ఇవ్వని వారు మనపై విమర్శలు చేస్తున్నారు. అర్హులకు దక్కే సంక్షేమం... అనర్హులకు దక్కవచ్చా..? అనర్హులకు పెన్షన్లు ఇచ్చిన వైసీపీ తీరును ప్రజలు గమనించాలి. తప్పు చేస్తున్నప్పుడు తప్పు అనే చెప్పే ధైర్యం ప్రజలకు రావాలి. మంచికి అండగా నిలబడాలి. అప్పుడే మాకు మరింత బలం చేకూరుతుంది. ప్రజలే నా బలం... బలగం. ప్రజలు అండగా ఉంటే... కొండలనైనా పిండి చేస్తాం. ప్రజల కోసం మరింత సంక్షేమాన్ని అందిస్తాం. దీన్ని ప్రజలంతా గమనించాలి. కూటమి ప్రభుత్వం రాగానే భర్త చనిపోయిన నెలలోనే పింఛన్లు అందిస్తున్నాం. ఈనెలలో రూ.3.14 కోట్లతో కొత్తగా 7,872 మందికి వితంతు పింఛన్లు ఇస్తున్నాం. రాష్ట్రంలో మొత్తం 8,10,182 మంది దివ్యాంగ పింఛన్లు, మెడికల్ పింఛన్లు ఇస్తున్నాం. దివ్యాంగులకు ఇస్తున్న రూ.6 వేలల్లో రూ.5,550 పెంచింది తెలుగు దేశం ప్రభుత్వాలే. 2 నెలలుగా పింఛను తీసుకోని 1,20,187 మందికి రూ.101 కోట్లు, 3 నెలలుగా పెన్షన్ తీసుకోని 11,986 మందికి రూ.15 కోట్లు అందించడం ప్రజా సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం." అని ముఖ్యమంత్రి అన్నారు. "రాష్ట్ర పునర్నిర్మాణం కోసం బీజేపీ, జనసేతో కలిసి పోటీ చేస్తే ప్రజలు చారిత్రాత్మక విజయం కట్టబెట్టారు. రాష్ట్ర విభజన తర్వాత కొన్ని ఇబ్బందులు వచ్చాయి. "సరిగ్గా 30 ఏళ్ల క్రితం ఇదే రోజున నేను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాను. ఈ కాలంలో నేను ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. అయినా వెనకడుగు వేయలేదు. సమైక్యాంధ్రలో ఎక్కవ కాలం ముఖ్యమంత్రిగా, విపక్షనేతగా పనిచేశాను. సంపద సృష్టించి, ప్రజలకు సంక్షేమం అందించాననే తృప్తి నాకు ఉంది. రాజంపేటలో నేను కట్టిన దోబీ ఘాట్లు చూసి ఆనందించాను. 25 ఏళ్ల క్రితం ఈ ఘాట్లు నేను కట్టినవే అని వారు చెబితే సంతోషమేసింది. ఈ 30 ఏళ్లలో నేను ఏనాడు విశ్రమించ లేదు. నిద్ర లేచింది మొదలు మిషన్ మాదిరి పనిచేస్తాను. తెలుగుజాతి అగ్రస్థానంలో ఉందంటే అందుకు టీడీపీనే కారణం. నాడు హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వాములయ్యాం. నేడు అమరావతి నిర్మాణం చేసే అవకాశం ప్రజలిచ్చారు. అలాగే ఆవిర్భావం నుంచి పార్టీ వెన్నంటే ఉన్న బీసీల రుణం తీర్చుకోలేనిది. అనునిత్యం ప్రజా సేవలోనే ఉన్నాను. పేదల జీవితాల్లో వెలుగులు నింపి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నా." అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "రాళ్లసీమగా మారుతుందనుకున్న రాయలసీమను రతనాలసీమ చేస్తున్నాం. సీమలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చాం. కరెంటు లేని పరిస్థితి నుంచి ఇంటిపైనే సోలార్ తయారుచేసే పరిస్థితి తెచ్చాం. పేదరికం నిర్మూలన కోసం వెలుగు తీసుకొచ్చాను. డ్వాక్రా, సాగునీటి , సహకార సంఘాలు ఏర్పాటు చేశాం. చెప్పినట్టే సీమకు కృష్ణాజలాలు తెచ్చాం. సీమ అభివృద్ధికి బ్లూ ప్రింట్ అమలు చేస్తున్నాం. కియాతో అనంతపురం జిల్లా రూపురేఖలు మార్చేశాం. రాబోయే రోజుల్లో ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్ రంగాలకు సీమను హబ్ చేశాం. గోదావరి నుంచి నీరు వృథాగా సముద్రంలోకి పోతుంటే సీమలో నీటి కోసం ఇబ్బందులు వస్తున్నాయి. వంశధార నుంచి గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం చేస్తాం." అని చంద్రబాబు వెల్లడించారు. "రాజంపేటను అభివృద్ధిలో ముందుకు తీసుకెళతాం. జిల్లాల విభజనలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. వాటిని సరి చేస్తాం. రాజంపేట నియోజకవర్గం ప్రజలు ఎన్నికల్లో మాకు ఓటేయలేదు. కొన్ని కారణాల వల్ల రాజంపేట ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు రాలేదు. అయినప్పటికీ రాజకీయాలు వేరు, అభివృద్ధి వేరు. కూటమిని ఓడించారు. గెలిచిన వారిని చూసుకోవాలి... వారి సమస్యలు తీర్చాలి. అయినా రాజకీయాన్ని అభివృద్ధితో ముడిపెట్టను... అభివృద్ధి చేస్తాను. 2014లో టీడీపీ ప్రభుత్వమే ఒంటిమిట్ట శ్రీరాముడి ఆలయాన్ని అభివృద్ధి చేసింది. రాజంపేటకు మెడికల్ కాలేజీ కావాలని అడిగారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటాం. ప్రజలందరికీ సంక్షేమం అందించాలన్న లక్ష్యంతో పాలన సాగిస్తున్నాం. పీ4తో పేదరిక నిర్మూలన సాధ్యం చేసి చూపిస్తాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. బోయనపల్లిలో దోబీ ఘాట్ ను ముఖ్యమంత్రి సందర్శించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై రజకులను అడిగి తెలుసుకున్నారు. దోబీ ఘాట్లలో షెడ్లు నిర్మించాలని రజకులు కోరగా వెంటనే వారు కోరిన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే దోబీ ఘాట్ కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులున్నా... అధికారులకు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా ప్రతినిధులు, స్థానిక టీడీపీ నేతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో ఏర్పడనున్న మరో అల్పపీడనం

### అప్రమత్తంగా ఉండాలని ఐఎండి హెచ్చరిక




**విశాఖపట్నం :** బంగాళాఖాతంలో రాబోయే 24 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం ఐఎండీ వెల్లడించింది. మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలకు భారీ నుంచి అతిభారీ వర్ష సూచన ఉన్నట్లు- పేర్కొంది. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేసింది. ఇదిలావుంటే ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలోని తమ్మిలేరు జలాశయానికి వరదనీరు పోటెత్తుతుందని తమ్మిలేరు జలాశయం ఇరిగేషన్ ఏఇ లాజర్ బాబు తెలిపారు. సోమవారం ఏఇ లాజర్ బాబు మాట్లాడుతూ ... తమ్మిలేరు జలాశయం ప్రస్తుత నీటిమట్టం 348.8 ఉండగా, ఇన్‌ఫ్లో 1800 క్యూసెక్కులు ఉండగా 3000 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు- తెలిపారు. తమ్మినేని జలాశయం పరీవాహ ప్రాంతాలు ధర్మాజీగూడెం గొల్లపూడిలోపుడి బలివే, ఏలూరు జలాశయం చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## స్థానికత అంశంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

### 9నుంచి 12 తరగతులు చదివితేనే లోకల్‌గా పరిగణింపు

### సుప్రీం ధర్మాసనం తీర్పు వెలువరింపు



**న్యూఢిల్లీ :** స్థానికత అంశంపై సుప్రీంకోర్ట్ సంచలన తీర్పునిచ్చింది. తెలంగాణలో వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థులకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను సమర్థించింది. గతంలో తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులు పక్కన పెడుతూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించింది. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదవాల్సిందేనన్న నిబంధనను అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. తెలంగాణలో వరుసగా 9 ,10, 11,12 తరగతులు చదివితేనే లోకల్ అంటూ స్పష్టం చేసింది. అయితే ఈ రూల్స్ లో ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఉంటు-ందనే షరతు పెట్టింది సుప్రీం కోర్ట్. లోకల్ రిజర్వేషన్ అంశంపై తెలంగాణకు ఊరట కలిగించేలా సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. వం-సగా నాలుగేళ్లు అంటే 9వ, 10వ, 11వ, 12వ తరగతులు తెలంగాణలో చదివితేనే స్థానికుడిగా పరిగణించాలని స్పష్టంచేసింది. అయితే, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. స్థానికత అంశంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 33కి అత్యున్నత న్యాయస్థానం పూర్తి స్థాయి మద్దతు తెలిపింది. తెలంగాణలో స్థానిక రిజర్వేషన్ల అంశం ఎప్పటి నుంచో వివాదాస్పదంగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 33 ప్రకారం ఇంటర్మీడియట్‌కు ముందు వరుసగా నాలుగేళ్లు చదివిన విద్యార్థులనే స్థానికులుగా పరిగణించాలని స్పష్టం చేసింది. కానీ, కొందరు విద్యార్థులు దీన్ని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రతి రాష్ట్రం తన స్థానిక రిజర్వేషన్ల కోసం తగిన నిబంధనలు రూపొందించుకునే అధికారం ఉందని సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్రం వాదనలు వినిపించింది. అయితే రాష్ట్ర విభజన తర్వాత తమ పిల్లలు మరో రాష్ట్రంలో చదవాల్సి వచ్చిందని అభ్యర్థుల తరపున వాదనలు వినిపించారు పిటిషనర్లు. అయితే ఇప్పటికే రాష్ట్రంలో లోకల్ కోటా పై జీవో 33 ను అమలు చేస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు విన్నవించింది. అయితే ప్రభుత్వ ఉద్యోగులు తప్పని పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల్లో పని చేస్తున్నారని..దాంతో వాళ్ళ పిల్లలకు జీవో 33 నుంచి మినహాయింపు ఇస్తామని ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. రాష్ట్రప్రభుత్వం చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకున్న సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బి ఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు వెల్లడించింది. అయితే గతేడాది హైకోర్ట్ ఇచ్చిన తాత్కాలిక మినహాయింపుతో స్థానిక కోటా కింద ప్రయోజనం పొందిన విద్యార్థులు తమ ప్రయోజనాలను కొనసాగించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇకపై ఎంబీబీఎస్, బీడీఎస్ యూజీ కోర్సులలో జీవో 33 ప్రకారమే స్థానిక కోటా రిజర్వేషన్లు అమలుకానున్నాయి. అయితే ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రమే జీవో 33 నుంచి మినహాయింపు ఇస్తామనడంపై ప్రైవేటు- ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము కూడా తప్పని పరిస్థితుల్లోనే రాష్ట్రాన్ని వదిలి ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తుందని తమ పిల్లల భవిష్యత్ గురించి ప్రభుత్వము కోర్టులు ఆలోచించాలని వేడుకుంటున్నారు.

## విజినరీ లీడర్ చంద్రబాబు నాయుడు



**అమరావతి :** పాలనాదక్షత, ముందుచూపు చంద్రబాబు ప్రత్యేకతలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆయనకు విజన్ ఉందని, అందుకు అనుగుణంగా పని చేస్తారని అన్నారు. భవిష్యత్తును ఊహించి ప్రణాళికా బద్ధంగా దూరదృష్టి తో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన దార్శనికుడు ఏపీ సీఎం చంద్రబాబు అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణం చేసి నేటికి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. పాలనాదక్షతతో ఆయన చేపట్టిన కార్యక్రమాలు, సంస్కరణలు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిని పరుగులు పెట్టించాయని ప్రశంసించారు. రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో చంద్రబాబు ముద్ర చిరస్మరణీయమన్నారు. పాలనలో ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా వాటిని సవాళ్లుగా స్వీకరించి ముందడుగు వేశారన్నారు. హైదరాబాద్‌ను ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చిన ఘనత చంద్రబాబుదే. ఆయన ఐటీ-కి పెద్దపీట వేయడంతోనే తెలుగు రాష్ట్రాల్లో మారుమూల గ్రామాల నుంచి ఐటీ- ఉద్యోగులు వచ్చారు. రైతు బజార్ల ఏర్పాటు-, డ్వాక్రా సంఘాల స్థాపన, పేదలకు వెలుగు ప్రాజెక్ట్, మీసేవా కేంద్రాలు ఏర్పాటు-వంటి నూతన ఆవిష్కరణలు ఆయన ముందుచూపును తెలియచేస్తాయి. రాష్ట్ర విభజన అనంతరం క్లిష్ట సమయంలో ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు చేపట్టి.. రాజధాని లేని రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా సాగారు. 2024లోనూ మరింత క్లిష్ట పరిస్థితుల్లో పాలన పగ్గాలు తీసుకున్నారు. కఠిన సవాళ్లు ముందున్నా దృఢ చిత్తంతో పాలన వ్యవస్థను ముందుకు తీసుకువెళ్తున్నారు. రాష్ట్రానికి సీఎంగా కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అభివృద్ధి పనులు, వివిధ ప్రాజెక్టులకు నిధులు సాధించడం చంద్రబాబు నాయకత్వ లక్షణాలు తెలియచేస్తాయి. పాలన వ్యవహారాల్లో సాంకేతికతను వినియోగిస్తూ, ప్రజలకు సత్వర సేవలు అందేలా చేస్తున్నారు. దార్శనికత కలిగిన చంద్రబాబు నిర్దేశకత్వంలో మేం ఏపీ అభివృద్ధికి నిబద్ధతతో పని చేస్తున్నామని పవన్ తెలిపారు.

## అన్నమయ్య ప్రాజెక్టును అనాథగా మిగిల్చారు

### ప్రాజెక్ట్ కొట్టుకు పోయి ఐదేళ్లయినా పట్టించుకోరా

### ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శలు

**కడప :** గత వైకాపా, నేటి కూటమి ప్రభుత్వాలు కలిసి అన్నమయ్య ప్రాజెక్టును 'అనాథ ప్రాజెక్టు'గా మార్చాయని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. ప్రాజెక్టు కొట్టుకుపోయి ఐదేళ్లు దాటినా పునర్‌నిర్మాణానికి దిక్కులేదన్నారు. 39 మందిని బలిగొన్న ఘోర విపత్తులో జరిగిన నష్టాన్ని పూడ్చే మనసు ప్రభుత్వాలకు లేదని మండిపడ్డారు. ఐదు గ్రామాలు కొట్టుకుపోతే పునరావాసానికి రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. గత సీఎం జగన్ రూ.800 కోట్లతో మరమ్మతులు అంటూ హడావుడి తప్పా ప్రాజెక్టును కట్టింది లేదు. పునరుద్ధరణ పేరుతో మూడేళ్లు గడిపారే తప్ప తట్టెడు మట్టి వేయలేదు. బాధిత కుటుంబాలకు ఇళ్లు అందలేదు. చనిపోయిన వారి కుటుంబాలకు ఉద్యోగాలు దక్కలేదు. ఇసుక మాఫియాతో ప్రాజెక్టుకు గండి పడితే అసెంబ్లీ వేదికగా హైలెవల్ కమిటీని ఏర్పాటు- చేస్తాం, దర్యాప్తు కొనసాగిస్తామని కాలయాపన తప్ప జగన్ చేసింది ఏమీలేదు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ప్రాజెక్టు కడతామని చెప్పి చంద్రబాబు మోసం చేశారు. రాజంపేటకు రెండు సార్లు వచ్చిపోయినా ప్రాజెక్టు పనులకు మోక్షం లేదు. రూ.340 కోట్లతో మరమ్మతులు అని చెప్పి రూపాయి కూడా ఇవ్వలేదు. రాజంపేట వేదికగా మళ్లీ మాయమాటలు చెప్పారు తప్పిస్తే ప్రాజెక్టు నిర్మాణంపై దిశా నిర్దేశర లేకపోవడం శోచనీయం. అన్నమయ్య కన్నీటి వ్యధకు శాశ్వత పరిష్కారం చూపాలి. వెంటనే పూర్తి స్థాయి నిధులు కేటాయించి ప్రాజెక్టును పూర్తి చేయాలి. సర్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాలి. కాంగ్రెస్ పక్షాన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని షర్మిల అన్నారు. కడప పర్యటనకు వచ్చిన ఏపీసీసీ చీఫ్ షర్మిలను చూసేందుకు ఓ దివ్యాంగుడు కర్నూలు నుంచి వచ్చాడు. ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశాడు. ఆ ఫొటోను షర్మిల సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అభిమానానికి అంగవైకల్యం అడ్డు కాదని తమ్ముడు సంజీవ్‌ను చూస్తే అర్థమవుతోందన్నారు.

## దక్షత కలిగిన నాయకుడు చంద్రబాబు

### సంక్షోభాలను పరిష్కరించిన నేత

### మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభినందనలు

**అమరావతి :** ముఖ్యమంత్రిగా చంద్రబాబు తొలిసారి బాధ్యతలు చేపట్టి 30ఏళ్లు పూర్తి చేసుకోవడం శుభపరిణామమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. చంద్రబాబు పాలన రెండు తెలుగు రాష్ట్రాలకు స్వర్ణయుగమని పేర్కొన్నారు. ఆయన పానలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, ప్రపంచనేతగా గుర్తింపు పొందారని అన్నారు. 15 ఏళ్ల కాలంలో అనేక సంక్షోభాలను పరిష్కరించిన నేత అని ప్రశంసించారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలబెట్టి తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. నాడు చంద్రబాబు రూపొందించిన విజన్ 2020 కలను సాకారం చేసి చూపించారు. దేశంలో నదుల అనుసంధానానికి ఆయన ఆద్యుడు. విద్యుత్, ఆర్థిక సంస్కరణలతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బాటలు వేశారు. ప్రతి కుటు-ంబం నుంచి ఒక ఐటీ- ఉద్యోగి ఉండేలా నాడు యువత భవిష్యత్తుకు బాటలు వేశారు. ప్రతి కుటు-ంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారు కావాలనే లక్ష్యంతో నేడు కృషి చేస్తున్నారు. నవ్యాంధ్ర సీఎంగా స్వర్ణాంధ్ర నిర్మాణానికి విజన్ 2047 లక్ష్యాన్ని నిర్దేశిరచుకుని ముందుకెళ్తున్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ పేదరిక నిర్మూలనకు శ్రీకారం చుట్టారు. అమరావతి, పోలవరం నిర్మాణం.. విశాఖను ఆర్థిక, ఐటీ- రాజధాని, రాయలసీమను పారిశ్రామిక కేంద్రంగా మార్చేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని గొట్టిపాటి పేర్కొన్నారు.

## ప్రైవేట్ ఫామ్ హౌజ్‌కు ధన్‌ఖడ్

### అధికారిక నివాసం ఖాళీచేసినట్లు వెల్లడి

**న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ దాదాపు ఆరు వారాల తర్వాత తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేశారు. ఈ క్రమంలోనే దక్షిణ దిల్లీలో ఛతర్‌పుర్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఫామ్‌హౌస్‌కు మారారు. మాజీ ఉపరాష్ట్రపతిగా ఆయనకు అధికారిక నివాసం కేటాయించే వరకు తాత్కాలికంగా అక్కడ ఉంటారని అధికారులు తెలిపారు. ఆ ఫామ్‌హౌస్ ఐఎన్‌ఎల్‌డీ నేత అభయ్ చౌతాలాకు చెందినదిగా తెలుస్తోంది. ఆరోగ్య కారణాలు చూపుతూ.. జులై 21న జగదీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. అప్పటినుంచి ప్రజాజీవితానికి దూరంగా ఉంటు-న్నారు. ఆయన ఇప్పటివరకు పార్లమెంట్ హౌస్ సమీపంలోని ఉపరాష్ట్రపతి భవనంలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన తన సమయాన్ని కుటు-ంబ సభ్యులతో గడుపుతున్నారని, టేబుల్ -టె-న్నిస్ ఆడుతున్నారని, యోగా సాధన చేస్తున్నారని ధన్‌ఖడ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇటీ-వల ఆయన మాజీ ఎమ్మెల్యే పింఛనుకు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ధనఖడ్ గతంలో రాజస్థాన్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1993 ఎన్నికల్లో కిషన్‌గఢ్ నుంచి కాంగ్రెస్ తరఫున విజయం సాధించారు. ఆ సమయంలో రూల్స్ కమిటికీ సభ్యుడిగానూ పనిచేశారు.

# మల్కాజ్గిరి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి

● మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మేడ్చల్ మల్కాజిగిరి సమయం న్యూస్ సెప్టెంబర్ 1:** ఈరోజు మల్కాజ్గిరి శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారు, తెలంగాణ రాష్ట్ర విద్యుత్, ఆర్థిక శాఖలు మరియు ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లు గారిని అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మల్కాజ్గిరి నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులకై నిధులు కేటాయింపు, విద్యుత్ సబ్ స్టేషన్ ల ఏర్పాటు , అలాగే ప్రజావసరాల సమస్యలు ఉప ముఖ్యమంత్రివర్యుల దృష్టికి తీసుకువెళ్లారు. అదే విధంగా, వెంకటాపురం డివిజన్ యాదమ్మనగర్‌లోని పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాలు ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాల వారు నివసించే ప్రాంతంలో విద్యుత్ బల్క్ మీటర్లు ఏర్పాటు చేయాలనీ ఎమ్మెల్యే గారు విజ్ఞప్తి చేశారు.

ఈ అంశాలపై వినతిపత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే గారి అభ్యర్థనకు ఉప ముఖ్యమంత్రివర్యులు సానుకూలంగా స్పందించారు. మల్కాజ్గిరి ప్రజల సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రివర్యులు హామీ ఇచ్చారు.

# పాత పెన్షన్ సాధన కోసం టీఎన్జీవోస్ ధర్నా




**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (సమయం న్యూస్):** పాత పెన్షన్ సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం అవుతున్నాయి. తెలంగాణ టీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాస్‌రావు పిలుపు మేరకు ఈరోజు నిర్వహించిన పోరాట సభకు సంఘీభావంగా టీఎన్జీవోస్ ఈఎన్టి కోటి యూనిట్ ఆధ్వర్యంలో ఆసుపత్రి ప్రాంగణంలో ఘనమైన ధర్నా జరిగింది. యూనిట్ అధ్యక్షులు తూముకుంట రాజు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి భాస్కర్, సహాధ్యక్షులు శ్రీహరి, డాక్టర్ రత్న కుమారి, ఆఫీస్ సూపరింటెండెంట్ సునీల్, హెల్త్ ఇన్స్పెక్టర్ సురేందర్‌రెడ్డి, సిపిఎస్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పాత పెన్షన్ హక్కు ప్రతి ఉద్యోగికి లభించాలని, సిపిఎస్ విధానం రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని ధర్నాలో గళమెత్తారు.

నిర్వాహకులు మాట్లాడుతూ – "ఉద్యోగుల భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే పాత పెన్షన్ తప్పనిసరి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశంపై వెంటనే చర్యలు తీసుకోవాలి. సిపిఎస్ విధానం పూర్తిగా ఉద్యోగులపై భారం మోపుతుంది" అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు నినాదాలు చేస్తూ ప్రభుత్వాన్ని ఉద్దేశించి డిమాండ్లు చేశారు. భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారిని మర్యాదపూర్వకంగా కలిసిన పర్వతగిరి బిజెపినేతలు,



**సమయం న్యూస్ వరంగల్ జిల్లా రిపోర్టర్..** ఇటీవల జరిగినటువంటి వరంగల్ జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఆరవసారి విజయం సాధించినటువంటి ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన పర్వతగిరి మండల బిజెపి నాయకులు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చీమల బిక్షపతి యాదవ్ జిల్లా ఉపాధ్యక్షులు పట్టాపురం ఏకాంతం గౌడ్ మాజీ ఎంపీపీ రంగు రజిత కుమార్ గౌడ్ , ఎస్సీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ బోట్ల మధు,మండల ఉపాధ్యక్షులు తౌర్రి లక్ష్మణ్ యాదవ్, పాయిలీ యాకన్న పటేల్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు చీమల చంద్ర యాదవ్, మండల నాయకులు దేసు రాము, వ్యాసాల సుధాకర్, తదితరులు పాల్గొనడం జరిగింది

# ప్రభుత్వం వెంటనే పెన్షనర్స్ బెనిఫిట్స్ చెల్లించాలి



**సమయం న్యూస్ వరంగల్ జిల్లా రిపోర్టర్..:** 398/ వేతనంతో ఉపాధ్యాయులుగా రెండు నుండి 5 సం లకు పైగా పనిచేసి, ఆ తరువాత రెగ్యులర్ వేతనం పొంది, రిటైర్ అయిన వారికి నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ,పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలిశోజు రామ మనోహర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్ జి పి ఎ టి) వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 398/ వేతనంతో పనిచేసి రిటైర్ అయిన పెన్షనర్ల ప్రత్యేక సమావేశం తుమ్మ వీరయ్య గారి అధ్యక్షతన తేది 31-8-2025 నాడు వరంగల్ గిర్మాజీపేట సరస్వతి విద్యానికేతన్ పాఠశాల లో జరుగగా ,రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలిశోజు రామ మనోహర్ గారు ముఖ్య అతిథి గా హాజరై , మాట్లాడుతూ 398/ చాలీ చాలని వేతనంతో పనిచేస్తూ విద్యారంగ అభివృద్ధి కొరకు వారు చేసిన కృషి ని గుర్తించి రిటైర్ అయిన తర్వాత అయిన వారికి న్యాయం చేయాల్సిన అవసరముందని, వీరితో నియామకమై రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ లో పనిచేసి రిటైర్ అయిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్స్ తో పెన్షనరీ బెనిఫిట్స్ మంజూరు చేశారని ,మన రాష్ట్రంలో కూడా ఆ ప్రయోజనం కల్పించకపోవడం వలన తక్కువ మొత్తంలో పెన్షన్ పొందుతూ ,ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మానవతా దృక్పథంతో ఈ సమస్యను పరిశీలించి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 50 మంది కి పైగా పెన్షనర్లు పాల్గొన్న ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి సాంబయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి యన్ సదానందం, జిల్లా మాజీ అధ్యక్షులు కర్రు సుధీర్ బాబు గారలు పాల్గొని ప్రసంగించారు. 398/ స్పెషల్ టీచర్ పెన్షనర్ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దూరి పెద్దన్న ఎస్ జి పి ఎ టి జిల్లా ,రాష్ట్ర శాఖలకు తమ ప్రాతినిధ్య లేఖలను అందించి సహకరించవలసినదిగా కోరారు. ఈ సమావేశం లో ఎం డి మదార్ సాహెబ్, మధుసూదన్ రావు, వీరాస్వామి, కందగట్ల యాదగిరి, కె కుమారస్వామి,కె సుధాకర్, జడల చంద్రశేఖర్ , ఎం డి మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రేవూరికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే నాగరాజు



**సమయం న్యూస్ వరంగల్ జిల్లా రిపోర్టర్..** ఎమ్మెల్యే క్వార్టర్స్ నందు పెద్దలు గౌరవనీయులు పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి గారి జన్మదినం సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు ...ఎమ్మెల్యే గారి వెంట కాంగ్రెస్ నాయకులు మన్నే బాబు రావు, మహమ్మద్ చోటే, నక్క కొమురెల్లి యాదవ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్లు డాక్టర్ శ్రీజ, శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం, సెప్టెంబర్1 : ( సమయం న్యూస్ ):** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లు జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, అధికారులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లిని అవహేళనగా మాట్లాడిన

# కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలి

- పంజాల అశోక్ గౌడ్



**సమయం న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 1:** ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ బీహార్ ఎన్నికల అధికార యాత్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా దర్భంగాలో జరిగిన దురదృష్టకర సంఘటన భారత ప్రధాని నరేంద్ర మోడీ తల్లి పైన అనుచిత వ్యాఖ్యలు,చేసిన రాహుల్ గాంధీ చిత్రపటాన్ని మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ అధ్వర్యంలో దహనం చేయడం జరిగింది ఈ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ మాట్లాడుతూ ఇటివల బీహార్ ఎన్నికల్లో అధికార యాత్ర లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లిని అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడాడం హేయమైన చర్య అని ఓటు చోరి అనే దోంగా నాటకాన్ని ప్రజలు నమ్మకపోవడంతో మనోవేదనకు గురైన రాహుల్ గాంధీ పిచ్చి పిచ్చి గా మాట్లాడుతున్నడు అని భారతదేశంలో స్త్రీ మూర్తులను గౌరవిస్తామని స్త్రీలను పరాశక్తిగా చూస్తామని అలాంటి తల్లి ని చులకనగా మాట్లాడిన రాహుల్ గాంధీ పార్లమెంట్ సాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సింగం సత్తయ్య , సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు కుడిక్యాల రాములు బిజెపి సీనియర్ నాయకులు నత్తి మల్లేష్ ముదిరాజ్, వాంజరి రాజు జిల్లా కౌన్సిల్ సభ్యులు మణె శేఖర్ ,మాజి కౌన్సిలర్ చంద్రబోస్, వెంకట్రాంరెడ్డి, కర్నాల శ్రీనివాస్, గజ్వేల్ ఐదు మండల ప్రధాన కార్యదర్శిలు ఇప్ప స్వామి, బారు అరవింద్,మండల ఉపాధ్యక్షులు ప్రభాకర్, స్వామి, బిజెవైయం నాయకులు అనిల్ , గజ్వేల్ అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ ఆనంద్ గౌడ్,నాయకులు రామస్వామి, సత్యనారాయణ,మహేష్, అశోక్ ,నాగరాజు, బాబు ,నరేష్ తదితరులు పాల్గొన్నారు

# ముందస్తు జాగ్రత్తలతో : సీజనల్ వ్యాధులకు బ్రేక్

● ప్రముఖ పిల్లల వైద్యులు కూరపాటి ప్రదీప్

● ( సమయం ఇంటర్వ్యూలో...)



**ఖమ్మం, సెప్టెంబర్ 1 : ( సమయం న్యూస్ ) :** ముందస్తు జాగ్రత్తలతోనే సీజనల్ వ్యాధులను అరికట్టగలమని ఖమ్మం నగరంలో ప్రముఖ పిల్లల వైద్యులు కూరపాటి ప్రదీప్ తెలిపారు. ఒక ప్రముఖ డాక్టర్ గా మాత్రమే కాకుండా ఆయన తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ( టీ సి ఏ ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు , యు వం అనే ఎన్జీవో వ్యవస్థాపకులు , తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ( డి ఎల్ ఎస్ ఏ ) సభ్యులు , ఎల్ ఎల్ బి పట్టా పుచ్చుకున్న డాక్టర్ ఆయన ఒక్కడే. వృతి రీత్యా వైద్యులుగా ప్రవృత్తి రీత్యా సామాజిక సేవ తత్పరుడిగా ఆయన పేరుంచారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలి , అనేకమంది ఆసుపత్రుల బాట పడుతున్న సమయంలో..... సమయం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి యం డి. షఫీ యు జమ కు ఆయన ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో.... సీజన్ వ్యాధులపై ప్రతి ఒక్కరికి అవగాహన పరచే విధంగా విలువైన సమాచారాన్ని అందజేశారు. వర్షాకాలంలో సీజన్ వ్యాధుల విజృంభనకు ... నిలువ నీరు , దోమల స్వైర విహా%తీ%రం కారణం అన్నారు. ముందస్తు జాగ్రత్తల తోనే ఈ సీజన్ వ్యాధులను అరికట్టవచ్చని స్పష్టం చేశారు. సీజన్ వ్యాధులలో విష జ్వరాలు సాధారణమని , అరుదుగా డెంగ్యూ , చికెన్ గున్యా బారిన కూడా పడవచ్చు అన్నారు. ఈ దేశ సమయంలో ఫ్లూ జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. డెంగ్యూలో మూడు రకాల దశలు ఉంటాయని , ఒకటి నార్మల్ ఫీవర్ రెండవది డెంగు షాక్ ఫీవర్ మూడవది క్వాలిస్స్ సీ రో సైటి స్ అని వివరిస్తూ... బిపి పడిపోవడం లో తేడా రావటం ప్లేట్లెట్స్ కూడా పడిపోవడం జరుగుతుందన్నారు. త్వరితగతంగా దీనిని గుర్తించి, నిర్ధారించి వైద్యం చేయనిపక్షంలో ప్రాణాంతకంగా పరిణమించే ప్రమాదం ఉందన్నారు. రెండు మూడవ దశలలో రక్తస్రావం కూడా జరిగే అవకాశం ఉందన్నారు. వీటితోపాటు మలేరియా వంటి విష జ్వరాలు కూడా వ్యాపిస్తాయి అన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం ప్రపంచానికి వనికించిన "కరోనా " పై అడిగిన ఒక ప్రశ్నకు ఇప్పటికీ..... మనలో కరోనా ఉందని , కాకుంటే దానిని ఎదుర్కొనే యాంటీ బాడీస్ మనలో పెరిగాయని , ఏదైనా కొత్త వ్యాధి సంక్రమించినప్పుడు మనలోని రోగ నిరోధక వ్యవస్థ దానిని ఎదుర్కోవటనికి సంసిద్ధమవుతుందన్నారు. కొత్తగా పుట్టుకొచ్చే రోగాల ను వాటి లక్షణాలు బట్టి నే టి మందులను వినియోగించి వాటిని అరికడుతున్నమన్నారు. తల సేమియా వ్యాధిగ్రస్తులకు తాను ఉచితంగా చికిత్స చేస్తున్నాను అని వెల్లడించారు. ప్రమాదకర వ్యాధుల విషయంలో అప్రమత అవసరమని , ముందుగా మనం వాటిని నిర్ధారించి , చికిత్స జరిపితే .... ప్రాణాపాయం నుండి విముక్తి పొందవచ్చని వివరించారు. నిల్వ నీరు లేనప్పుడు , మురుగు కాలువలు శుభ్రంగా ఉండగా... దోమలు ప్రభలవనీ.... వైరస్లు స్వైర విహారం చేయవని .... అలాంటి సమయంలో సీజనల్ వ్యాధులు రావని అంటూ ముగించారు.

# నిబంధనలు ఉల్లంఘించిన స్థలాలపై కేసులు వేసాం

- తగిన ఆధారాలు ఇస్తాం బిజెపి నేతలు
- చిత్తశుద్ధి నిరూపించుకోవాలి



**సమయం న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 1 :** బిఆర్ఎస్ పార్టీ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి అక్రమాలతో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, అయితే రాజకీయ లబ్ధి కోసం బిజెపి నేతలు ఆయన అవినీతి, అక్రమాలను తమకు అంటగడుతున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ విమర్శించారు. సోమవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి నేతలకు చిత్తశుద్ధి ఉంటే ఎంపీ రఘునందన్ రావు తో కేసులు వేయించాలని డిమాండ్ చేస్తూ, ప్రతాప్ రెడ్డి అక్రమాలపై తగిన ఆధారాలు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ముఖ్యంగా ప్రజ్ఞాపూర్ ఊర చెరువు కాలువల కబ్జాతో పాటు, నిబంధనలు ఉల్లంఘించి వంటిమామిడి వద్ద కాల్వల ధ్వంసం, ప్రజ్ఞాపూర్ లోని జగదేవ్ పూర్ రోడ్డులో అక్రమ వెంచర్ ఏర్పాటు, ప్రభుత్వ స్థలాల కబ్జా, ఆర్ అండ్ ఆర్ కాలనీ అక్రమాలు తదితర వాటిపై ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే తూ%శీ%కుంట నర్సారెడ్డి నేతృత్వంలో కేసులు వేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రజల సొమ్మును అప్పనంగా పొందుతూ రాజ భోగాలు అనుభవిస్తున్న కేసీఆర్ గజ్వేల్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా ఇక్కడి ప్రజలు ఆయనను నమ్మి ఓటేసిన పాపానికి తగిన శిక్ష అనుభవిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే పదేళ్ల పాటు కమిషన్లు పొంది పనులు చేపట్టిన కేసీఆర్ వారికి బిల్లులు ఇవ్వకపోవడంతో మధ్యలోనే నిలిపివేసినట్లు చెప్పారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా కెసిఆర్ కేబినెట్ ర్యాంకులో కొనసాగుతుండగా, ఆయన అసెంబ్లీకి వెళ్లకుండా, నిధులు అడగకుండా అసంపూర్తి పనులు ఎలా పూ-ర్తవుతాయని నిలదీశారు.గజ్వేల్ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే తూ%శీ%కుంట నర్సారెడ్డి శక్తివంతన లేకుండా కృషి చేస్తూ, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు వీలైనన్ని నిధులు సాధిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు మండల కాంగ్రెస్ పార్టీ బాధ్యులు సుఖేందర్ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్ణాకర్ రెడ్డి, వహీద్ ప్యాక్స్ డైరెక్టర్ బాల్ రెడ్డి, కొండపోచమ్మ దేవస్థానం డైరెక్టర్ గుండు లక్ష్మణ్ నాయకులు కుంట్ల లక్ష్మారెడ్డి, జహీర్, గాడిపల్లి శ్రీను, షహీద్, శివారెడ్డి, జంగం రమేష్ గౌడ్, జాంగిర్, కొండల్ రెడ్డి, జాకీర్, జూపల్లి లక్ష్మణ్, మల్లారెడ్డి, కొడకండ్ల బాలు, సబ్బని నరేష్, అరుణ్, శ్రావణ్ పాల్గొన్నారు

# దండాలయ్య ఉండ్రాలయ్య..ఓఓఓ గణేష

- పురవీధులలో భక్తిశ్రద్ధలతో
- గణనాథునికి పూజలు.. రవికుమార్ యాదవ్.





**శేరిలింగంపల్లి సెప్టెంబరు 1 సమయం న్యూస్. :** నియోజకవర్గ పరిధిలో పలు కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక ప్రత్యేక పూజలు,అన్నదాన కార్యక్రమాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టేడ్ ఎమ్మెల్యే, ఇంచార్జి రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.గణేష్ నవరాత్రులలో భాగంగా సోమవారం కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని ఆస్బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డి నగర్ ఈ సేవ గ్రౌండ్ వద్ద, ప్రగతి నగర్, హనుమాన్ నగర్, మాదాపూర్ డివిజన్ చంద్రానాయక్ తాండా, హఫీజ్ పేట్ డివిజన్ సాగర్ సంఘం సొసైటీ వద్ద, హఫీజ్ పేట్ గ్రామంలో ,చందా నగర్ డివిజన్ పరిధిలోని టెలిఫోన్ కాలనీ, లింగంపల్లి డివిజన్ పరిధిలోని తారా నగర్ తుల్జాభవానీ ఆలయం వద్ద, కూరగాయల మార్కెట్ వద్ద స్థానిక కాలనీల ప్రజలు ఏర్పాటు చేసిన గణేష్ మండపాలలో నిర్వహించిన వినాయక ప్రత్యేక పూజలు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టేడ్ ఎమ్మెల్యే, ఇంచార్జి రవికుమార్ యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు ,అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలకు ఆహ్వానించిన స్థానిక కాలనీ నాయకులకు, అసోసియేషన్ వారికి ,ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, ఈ గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో , ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు, వినాయక పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించి ,నిమర్జన కార్యక్రమ సమయంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ నిర్వహించాలని అసోసియేషన్ సభ్యులను, స్థానిక ప్రజలకు సూచించారు.

# కాలేశ్వరంపై ఇచ్చిన ఘోష్ కమిషన్ దొంగ కమిషన్ ,ఫేక్ కమిషన్



**సమయం న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 1 :** సోమవారం రోజు గజ్వేల్ నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ కరీంనగర్ రాజీవ్ రహదారి ప్రజ్ఞాపూర్ పాతూర్ బ్రిడ్జి వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుపై గోష్ వేసిన కమిషన్ ఫేక్ కమిషన్ అని దొంగ కమిషన్ అని కాళేశ్వరం పై దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై నిరసన తెలుపుతూ సీఎం డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నిరసన తెలిపి రాజీవ్ రహదారిపై కెసిఆర్ నిర్మించిన తెలంగాణ జీవనధార కాళేశ్వరం ప్రాజెక్టుపై ఓర్వలేక బిజెపి కాంగ్రెస్ ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయి తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి సాగునీరును ఇవ్వకుండా తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్టుల నీటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలించడానికి చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మిత్రులు నరేంద్ర మోడీ బిజెపి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నాయని తెలిపారు బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ కరీం నగర్ రాజీవ్ రహదారిపై కెసిఆర్ నిర్మించిన తెలంగాణ జీవనధార కాలేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ దొంగ కమిషన్, కాలేశ్వరంపై దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై నిరసన తెలుపుతూ సిఎం డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం డౌన్ అంటూ పెద్ద ఎత్తున నిరసన తెలిపి బైఠాయించి ధర్నా చేయడం జరిగింది కిలోమీటర్ల మేర భారీగా నిలిచిపోయిన వాహనాలు రేవంత్ రెడ్డి దేశ ప్రధాని నరేంద్ర మోడీ లు కేసీఆర్ పై కుట్ర పండుతున్నారని అందులో భాగంగానే కాళేశ్వరం నివేదికను సిబిఐ కి అప్పగించే కుట్ర చేస్తున్నారని తెలి పారు దీనిని పూర్తిగా ఖండిస్తున్నామని అన్నారు యూ రియా కొరతతో గ్రామాల్లో కాంగ్రెస్ బీజేపీ నేతలు తిరిగి పరిస్థితి లేదని తిరిగితే ప్రజలు తిరగబడుతున్నారని కెసిఆ ర్ పై కుట్రలు చేస్తే ఊరుకోబమని తెలంగాణ మరో ఉ ద్యమానికి సిద్ధంగా ఉందని వంటేరు ప్రతాప్ రెడ్డి కాం గ్రెస్ ప్రభుత్వం హె చ్చరించారు కాంగ్రెస్ బిజెపి ప్రభు త్వాలు కుమ్మక్కై తెలం గాణ ప్రాంత ప్రజలపై రైతాంగం పై కుట్రలు చేస్తూ కాళేశ్వరం పేరిట దొంగ నాటకాలు ఆడుతున్నాయని తెలిపారు కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు కేసీఆర్ పై కాలేశ్వ రంపై చేస్తున్న కుట్రలను ప్రజలతో కలిసి కుట్రలను తిప్పికొడతామని అవసరమైతే తెలంగా ణ రాష్ట్రాన్ని కెసిఆర్ సారధ్యంలో ఏ విధంగా సాధించుకు న్నామో మీ కుట్లను భగ్నం చేయడానికి మరో ఉద్యమానికి తెర లేపు తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డిని నరే ంద్ర మోడీని హెచ్చరించారు కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు తెలంగాణ అస్తిత్వంపై కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు గోష్ కమిషన్ను సిబిఐ ను వెంటనే ఉపసం హరిం చుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేస్తూ హెచ్చరించారుో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, వైస్ ఎంపీపీల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎం సి రాజమౌళి, మండల పార్టీ అధ్య క్షులు బెండ మధు, నవాజ్ మీరా, నూనె కు మార్ యాద వ్, జడ్పిటిసిలు పంగ మల్లేశం, అనంతుల అశ్విని ప్రశాం త్ అర్జున్ గౌ డ్, యూత్ విన్ నాయకుడు జుగర్ పాషా, ఎంపీపీలు రాగల సుగుణ దుర్గయ్య, పాండు గౌడ్, లతా రమేష్ గౌ డ్, నవనీత రవీందర్, రాష్ట్ర నాయకులు ఖాజా విరాసద్ అలీ, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, పిఎ సిఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, కృష్ణారెడ్డి, టిఆర్ఎస్ పార్టీ ఎంపీపీలు జెడ్పి టిసిలు పిఎసిఎస్ చైర్మన్లు సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఎంపిటిసిలపూర్ అధ్యక్షులు మండల పార్టీ అధ్యక్షులు అనుబంధ సాయంకాల నాయకులు సర్పంచులు ఎంపిటిసిలు తదితరులున్నారు

## ఎల్లం బజార్ విజయ గణపతి ( బంగారు వర్ణపు ) ప్రత్యేక పూజ కార్యక్రమం

- పాల్గొన్న స్వామి వారిని దర్శించుకున్న నన్నపునేని నరేందర్..



**సమయం న్యూస్ వరంగల్ జిల్లా రిపోర్టర్..** 24 వ డివిజన్ ఎల్లం బజార్ లోని ఆకుతోట సంజీవ్ గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 45 అడుగుల భారీ గణ నాథుడు విజయ గణపతి ( బంగారు వర్ణపు ) యొక్క ప్రత్యేక పూజ ఈ రోజు రాత్రి నిర్వహించిన కార్యక్రమం కు శ్రీ ఆకుతోట సంజీవ్ గారి ఆహ్వానం మేరకు స్వామి వారి పూజ కార్యక్రమం లో కూర్చొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ గారు. అనంతరం వేద పండితులు సుమన్ శర్మ మరియు వారి బృందం చేత స్వామి వారి ప్రత్యేక తీర్థ ప్రసాదలు అందించి శాలువా తో సన్మానించారు. ఈ కార్యక్రమం భద్రకాళి హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, సీతారాం, సోను, పొగాకు సందీప్, బజ్జురి వాసు, తోట కుమార్,రాజేందర్ చారి, బైరి వంశీ, రాజు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల కిడ్నాప్ ముఠా అరెస్ట్ చందానగర్ పోలీసులు




**శేరిలింగంపల్లి సెప్టెంబర్ 1 సమయం న్యూస్ . :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని సైబరాబాద్ పరిధిలోని చందానగర్ లో బాలల కిడ్నాప్ ముఠాను చందానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు, గత ఐదేళ్లుగా సైబరాబాద్ సంగారెడ్డి జిల్లాలలో ఈ ముఠా చిన్నారులను కిడ్నాప్ చేస్తుందని ఆగస్టు 26న లింగంపల్లిలో నాలుగేళ్ల అఖిల్ అనే బాలుడు అదృశ్యమయ్యాడు, తల్లిదండ్రులు ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేసి ముఠాను అరెస్టు చేశారు

## జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రూ.4.60 కోట్లతో సీసీ రోడ్లు, మౌలిక సదుపాయాలు

- శంకుస్థాపన చేసిన మంత్రి గడ్డం వివేక్, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి
- నగరంలో ప్రతి వాడా, బస్తీ సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ: మేయర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 01( సమయం న్యూస్) :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్‌లో రూ.4.60 కోట్ల వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్లు, మౌలిక సదు-పాయాల పనులకు సోమవారం మంత్రి గడ్డం వివేక్ , జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ లు శంకుస్థాపన చేశారు.ప్రజలకు హామీ ఇస్తూ, ప్రతి వాడా, బస్తీ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా మంత్రి , మేయర్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ లు మల్ రెడ్డి రాంరెడ్డి , పటేల్ రమేష్ రెడ్డి , అజారుద్దీన్ , నవీన్ యాదవ్, భవాని శంకర్ , పెద్ద ఎత్తున నాయకులుపాల్గొన్నారు.

**పెండింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి:మేయర్ గద్వాల విజయలక్ష్మి**

అనంతరం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి క్యాంప్ కార్యాలయం లో జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులతో బంజారాహిల్స్ డివిజన్ లో పెండింగ్ వర్క్స్ పైన సమీక్ష నిర్వహించారు.బంజారాహిల్స్ డివిజన్ లో పెండింగ్‌పనులన్నింటినీ త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకొని రావాలి అని మేయర్ అధికారులను ఆదేశించారు.

## ఆర్టీసీ కీలక నిర్ణయం.. డ్రైవర్లు ఫోన్లు వాడకంపై నిషేధం..

- తెలంగాణ: ప్రయాణికుల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది..
- బస్సు నడిపే సమయంలో డ్రైవర్లు సెల్ ఫోన్లు వినియోగించడాన్ని నిషేధించాలని నిర్ణయించింది.

**హైదరాబాద్ సెప్టెంబర్ 1( సమయం న్యూస్).:** ఈ మేరకు నేటి నుంచి పైలట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేయనుంది. ఎంపిక చేసిన 11 డిపోల పరిధిలో ఈ విధానం ప్రయోగాత్మకంగా అమలవుతుంది. గ్రేటర్ జోన్ లోని ఫరూక్ నగర్, కూకట్‌పల్లి డిపోలు ఈ జాబితాలో ఉన్నాయి..

## ఆశా వర్కర్ల అక్రమ అరెస్టు ఖండన

● సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య

**సమయం న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 1 :** ఆశా వర్కర్ల తమ సమస్యలు పరిష్కరించాలని చలో హైదరాబాద్ నిర్వహిస్తుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్లను ముందస్తు అరెస్టు చేయడం జరిగిందని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులను ఖండించడం జరిగింది తెలంగాణలోని ప్రజాపాలన ప్రభుత్వం ఆరు ప్రభుత్వ హామీలతో పాటు ఏడవ హామీ ప్రజాస్వామ్యం అంటూనే ఆశా వర్కర్లు చేస్తున్న ధర్నాలకు అనుమతి ఇవ్వకుండా ఒకరోజు ముందుగానే ఆశా వర్కర్లు మహిళలు అని చూడకుండా సెలవు రోజు కుటుంబ సభ్యులతో పిల్లలతో ఉంటున్న క్రమంలో అక్రమంగా తీసుకొచ్చి పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం జరిగిందని అన్నారు. ఒక పక్కన ప్రజాస్వామ్యం ఉంటేనే రెండో పక్కన నిర్బంధం ప్రభుత్వం ప్రయోగిస్తుందని ఇది సరైన చర్య కాదని అన్నారు ప్రజా సమస్యలు చర్చించి పరిష్కరించకుండా నిర్బంధాలతో ఉద్యమాలను అణిచివేయలేరని అన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు అసెంబ్లీ సాక్షి స్వేచ్ఛ అని చెబుతూ ఆచరణలో మాత్రం నియంతృత్వ చర్యలకు పూనుకుంటున్నారని అన్నారు ప్రభుత్వం ఇప్పటికైనా ఆశ వర్కర్ తో చర్చలు జరిపి కనీస వేతనాలు రిటైర్మెంట్ బెనిఫిట్ పిఆర్సి బీమా సౌకర్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు లేనిచో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## నెక్లెస్ రోడ్డు మార్గంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్



**హైదరాబాద్: సెప్టెంబర్ 01( సమయం న్యూస్) :** నగరంలో గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జీహె చ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. నెక్లెస్ రోడ్డు మార్గంలో పీపుల్స్ ప్లాజా, సన్ రైజింగ్ పాయింట్, లేక్ వ్యూ పార్క్ బతుకమ్మ కుంట, సంజీవయ్య పార్క్ బేబీ పాండ్ లలో చేపట్టిన ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యారికేడింగ్, లైటింగ్, క్రేన్‌లు, కంట్రోల్ రూమ్ వంటి వాటిని తనిఖీ చేశారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ...ప్రధాన ఏర్పాట్లు:రోడ్డు మరమ్మతులు: నగరంలో 303 కిలోమీటర్ల ప్రధాన రోడ్డు మార్గంలో ఊరేగింపు సజావుగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేశామని, రోడ్డు సేఫ్టీ డ్రైవ్‌లో భాగంగా 90 శాతం గుంతలను పూడ్చామని చెప్పారు.పారిశుద్ధ్య కార్యక్రమాలు: నిమజ్జనం రోజున పారిశుద్ధ్య పనుల కోసం 14,486 మంది శానిటేషన్ సిబ్బందిని మూడు షిఫ్టుల్లో నియమించినట్లు తెలిపారు.ప్రజలకు విజ్ఞప్తి: గణేష్ ప్రతిమలను సకాలంలో నిమజ్జనానికి తరలించాలని నిర్వాహకులను, ప్రజలను ఆయన కోరారు. అలాగే, ఊరేగింపు మార్గాలలో ఏర్పాటు చేసిన గార్బేజ్ పాయింట్‌లలోనే చెత్తను వేయాలని సూచించారు.ఈ పరిశీలనలో ఆయన వెంట జీహెచ్ఎంసీ అధికారులు కూడా ఉన్నారు.

## రైతులు పంటల వివరాలను నమోదు చేసుకోవాలి

● కొడంగల్ ADA శంకర్ రాథోడ్



**వికారాబాద్:కొడంగల్:సెప్టెంబర్,01,(సమయం న్యూస్):** రైతులు వేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలని కొడంగల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శంకర్ రాథోడ్ సూచించారు.ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కొడంగల్, బోమ్రాస్పేట్, దుద్యాల్, దౌల్తాబాద్ మండలాల్లోనీ రైతులు వేసిన పంటల వివరాలను సెప్టెంబర్ 1, 2025 నుండి నవంబర్ 1, 2025 వరకు గ్రామాల వారీగా, సర్వే నెంబరు వారీగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అన్నారు.పంట నమోదు ఆధారంగానే ప్రభుత్వం పంటల కొనుగోలు , రైతుల పంటనష్టం పరిహారాలు,రైతు భరోసా వంటి ప్రభుత్వ పథ కాల లబ్ధి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.రైతులు తమ గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కొడంగల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శంకర్ రాథోడ్ కోరారు.

## సాగుకు సరిపడా యూరియా ఎరువులు సిద్ధం

- డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి



**సమయం న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 1 :** సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీల కృషి ఫలితంగా సిద్దిపేట జిల్లాకు 2వేల టన్నుల యూరియాను కేంద్రం కేటాయించిందని, ఇందులో భాగంగానే సోమవారం గజ్వేల్ రేక్ పాయింట్ కు 1000 టన్నుల యూరియా చేరిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. అయితే యూరియా ఎరువులు పక్కదారి పట్టకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అయితే యూరియా బ్లాక్ మార్కెట్ కు తరలించకుండా, ప్రత్యేక నిఘా కొనసాగిస్తుండగా, ఇందుకు రైతులు సహకారం అందించాలని కోరారు. అవసరం ఉన్న మీరకే రైతులు యూరియాను కొనుగోలు చేయాలని సూచించారు. ఇక యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఎరువుల సమస్యను దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

# గణేష్ మండపాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మారబోయిన రవి యాదవ్.











**శేరిలింగంపల్లి సెప్టెంబర్ 1 సమయం న్యూస్ .:** గణ నాధుడి నవ రాత్రుల సందర్భంగా శేరిలింగంపల్లి నియోజిక వర్గంలోని శేరిలింగంపల్లి, తారా నగర్, హఫీజ్పేట్, మదినగూడ పలు గణేష్ మండపాలలో సందర్శించి విఘ్నేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాలలో గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ యూత్ మాజీ వైస్ ప్రెసిడెంట్ మారబోయిన రవి యాదవ్ హాజరయ్యారు,ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు...

## ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.



**వికారాబాద్:సెప్టెంబర్,01-09(సమయం న్యూస్) :** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 86 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్,సుధీర్ ట్రైనీ కలెక్టర్ హార్ష్ చౌదరి, డి ఆర్ ఓ మంగి లాల్, ఆర్ డి ఓ వాసు చంద్ర లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

ఫిర్యాదులను పెండింగ్ లో ఉంచ కుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎల్ఎన్ అమలులో ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలదే కీలక పాత్ర : కలెక్టర్



**మెదక్ సెప్టెంబర్1( సమయం న్యూస్).:** ప్రభుత్వ పాఠశాలలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమర్సీ (ఎఫ్ఎల్ఎన్) అమలులో ఆయా మండలాల ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులదే కీలక ప్రాత అని, కావునా పట్టిషంగా అమలు చేసి విద్యార్థులందరు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమర్సీ (ఎఫ్ఎల్ఎన్) అమలులో ఆయా మండలాల ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులదే కీలక ప్రాత అని, కావునా పట్టిషంగా అమలు చేసి విద్యార్థులందరు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా చర్యల తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. మెదక్ డైట్ కళాశాలలో జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఈ సంవత్సరం 10 వ తరగతి విదారులందరు 100% ఉత్తీర్ణత విధంగా కృషిచేయాలని, ఉపాధ్యాయుల, విదార్థుల ముఖహాజిరు(FRS) సరిగా చేయాలని, సూచించారు.ఉ పాధ్యాయులు ఎఫ్ఆర్ఎస్ హాజరు విషయంలో చర్యలు చేపట్టాలన్నారు. Inspire నామినేషన్లు అందరు చేయలని, SET Infra gaps 3500 MEOs, MPDO, పొంచాలని తెలిపారు, ఎంఈఓ లు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు పాఠశాలలను సందర్శించినప్పుడు ఒక పాఠశాలలో సుమారు 35 నిమిషాల సమయం కేటాయించాలన్నారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్,, అసిస్టెంట్ మోనిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి,, సైన్స్ ఆఫీసర్ రాజిరెడ్డి ASC qMHŽ, CMO రాజు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు , మండల విద్యాధికారులు పాల్గొన్నారు

## గణేష్ శోభయాత్ర నిర్వహించే రూట్ మార్గాన్ని పరిశీలించిన: ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్



**నారాయణపేట జిల్లా:కోస్గి,మద్దూరు (మం)సెప్టెంబర్ (సమయం న్యూస్) :** సోమవారం ఉదయం కోస్గి, మద్దూర్ మండల కేంద్రలలోని గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వినాయక విగ్రహాల శోభాయాత్ర నిర్వహించే రూట్ మార్గాన్ని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్, అధికారులతో కలిసి పరిశీలించారు. మొదటగా కోస్గి లోని మున్నూరు వాడ, బార్పేట్ లోనీ వినాయక విగ్రహాలను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి కమిటీ సభ్యులతో మాట్లాడారు... గణేష్ మండపాల వద్ద అప్రమత్తంగా ఉండాలని వాలంటీర్లు తప్పకుండా ఉండాలని, ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ తీసుకోవాలని వారికి సూచించారు. అనంతరం గణేష్ రూట్ మార్గాన్ని పరిశీలించారు. శివాజీ చౌక్ నుండి, రామాలయం వీధి నుండి మున్సిపల్ ఆఫీస్, మున్నూరు గేరి, సయ్యద్ పహాడ్ దర్గా నుండి సజ్జ ఖాన్ పెట్ లోని దండం చెరువు వరకు రూట్ మార్గాన్ని పరిశీలించి అనంతరం దండం చెరువు దగ్గర బరికేట్స్ ఏర్పాటు చేయడం, విగ్రహాలు పెద్దగా ఉంటే క్రేన్ ఏర్పాటు చేయాలని, చెరువు దగ్గర లైటింగ్, రూట్ మార్గంలో రోడ్డు మరమ్మతులు మొదలైనవి రెవెన్యూ , పోలీసులు అధికారులు సంయుక్తంగా దగ్గరుండి చూడాలని అధికారులకు తెలిపారు.మద్దూర్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ బాల గణేష్ యూత్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహాన్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కమిటీ సభ్యులతో మాట్లాడుతూ వినాయక నిమజ్జనం చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని,గణేష్ విగ్రహం పెద్దగా ఉన్నందున కరెంటు వైర్లు కేబుల్ వైర్లు లేకుండా తీయాలని, నిమజ్జనం సమయంలో పూర్తిస్థాయిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... కోస్గి, మద్దూర్ లో వినాయక నిమజ్జన శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరుగుతుందని, గణేష్ మండపాల దగ్గర ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని,మంటపాల దగ్గర రాత్రి సమయంలో దొంగతనాలు జరగకుండా వాలంటీర్స్ కచ్చితంగా ఉండాలని సూచించారు.ప్రతి గణేష్ విగ్రహం దగ్గర పాయింట్ బుక్స్ ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు.ఉత్సవాలను ప్రజలు సంతోషంగా శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ తెలిపారు. ఎస్పీ గారితో పాటు సిఐ సైదులు, ఎస్సై లు బాలరాజు, విజయ్ కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ ఘటనపై సమగ్ర విచారణ జరుపాలి

● అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్ కి వినతి



**సమయం న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 1:**జగదేవ్పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో గత కొన్ని రోజులుగా విష జ్వరాలు డెంగ్యూతో ప్రజల ఇబ్బంది పడి డెంగ్యూతో ఇద్దరు మరణించిన విషయంలో పారిశుద్ధం పనులు సక్రమంగా నిర్వహించ లేదని జిల్లా కలెక్టర్ గ్రామ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో డిపిఓ ఇచ్చిన నివేదికలో గ్రామ కార్యదర్శి ఒకరిని బాధ్యులను చేస్తూ కలెక్టర్ కి నివేదిక ఇచ్చారు ఈ విషయంలో కిందిస్థాయి ఉద్యోగి దళితుడు కాబట్టే అతని ఒక్కడినే బాధ్యులను చేశారు ఇది కచ్చితంగా కులవ్యవక్షత కింద వర్తిస్తుంది. గ్రామ స్పెషల్ ఆఫీసర్ అయిన ఎంపీడీవో రెడ్డిని ఎందుకు బాధ్యులను చేయలేదు. డిపిఓ ఇచ్చిన నివేదిక పైన సమగ్ర విచారణ జరపాలని ఈ రోజు జిల్లా కలెక్టర్ కార్యాలంలో అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్ ని కలిసి వినతపత్రం అందజేసిన గ్రామస్తులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో విషరాల వల్ల భయభ్రాంతులకు గ్రామస్తులు గురవుతున్నారని గ్రామస్తుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక డాక్టర్ల తోటి కొద్దిరోజులపాటు పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు జగదేవపూర్ మండల ఎంపీడీవో ఏదైనా సమస్య ఉందని చెప్పుకుందాం అంటే కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదన్నారు. ఎంపీడీవో రామిరెడ్డిపైన కచ్చితంగా మండలంలో సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ గిరిమ అగర్వాల్ స్పందిస్తూ మీరు ఇచ్చిన దరఖాస్తు పైన సమగ్ర విచారణ చేపిస్తా బాధ్యుల పైన చర్యలు తప్పకుండా తీసుకుంటాం. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోసానిపల్లి రాజు తిమ్మాపూర్ గ్రామానికి సంబంధించిన పోసాన్ పల్లి సాయిలు, గుండ్రు సుదర్శన్, పోసానిపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు తిమ్మాపూర్ లో డ్రైనేజీ కోసం నిధులు కేటాయిస్తున్నాం ఈరోజు గ్రామంలో ఎన్ని మీటర్ల డ్రైనేజీ అవసరం ఉందో ఎస్టిమేషన్ వేయమని అధికారులను పంపించాం అదేవిధంగా విష జ్వరాల పైన శాంపిల్స్ స్వీకరించి ఢిల్లీకి పంపించాం నివేదికలు వచ్చిన తర్వాత చట్టపరమైన చర్యలు కచ్చితంగా తీసుకుంటాం. తిమ్మాపూర్ లో హెల్త్ క్యాంపు పెట్టి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటున్నాం పూర్తయ్యే వరకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తాం

# వినాయక నిమజ్జనం అన్ని శాఖల సమన్వయం తో విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ సెప్టెంబర్1( సమయం న్యూస్).:**వినాయక చవితి ఉత్సవ శాంతియుత కమిటి సమావేశం వినాయక నిమజ్జనం పై ఫీస్ కమిటి సభ్యులు, సంబధిత జిల్లా అధికారులతో సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లు మాట్లాడుతూ ఈ నెల 4, 6 తేదీలలో 9వ రోజు, 11వ రోజు నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా సంబంధిత శాఖలన్నీ సమగ్ర సమన్వయంతో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులు ఆదేశించారు.

**బాధ్యతాయుత ఏర్పాట్లు:**నిమజ్జన కార్యక్రమంలో ఎక్కడా అవాంచనీయ సంఘటనలు జరగకుండా, పూర్తి జాగ్రత్తలు, భద్రతా చర్యలు, అవసరమైన ఏర్పాట్లు పాటించాలని సూచించారు. కార్యక్రమం పూర్తయ్యేంతవరకూ అధికారులంతా హై అలర్ట్ లో ఉండాలని తెలిపారు.

మున్సిపల్, పంచాయితీ, ఎక్సైజ్, విద్యుత్ శాఖలు - సంబంధిత మరమ్మత్తు పనులు, రహదారులపై గుంతలు పూడ్చడం, వాటర్ , విద్యుత్ సదుపాయాలు పర్యవేక్షించడం., మండపాల వద్ద ప్రత్యేక శ్రద్ధ, శుభ్రత, భద్రతా చర్యలపై కంట్రోల్. ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆన్నారు. ఎక్సైజ్ శాఖ 9 వ, 11వ రోజులలో బెల్ట్ షాపులు పూర్తిగా మూసివేయాలనిఎక్కడా కూడా బెల్ట్ షాపులు తెరవకుండా, ఎక్సైజ్ అధికారులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లు క్రేన్లు, గజ ఈతగాళ్లు, అవసరమైతే NCC టీమ్, అపర్ మిత్ర టీమ్ లను రంగంలోకి దించేందుకు సిద్ధంగా ఉంచాలని సూచించారు. క్రేన్ ఆపరేటర్లకు ముందుగానే హెల్త్ చెకప్ చేయించాలని, వారి లిస్టును అధికారులకు సమర్పించాలని, షిఫ్ట్ వారీగా ఆర్డర్లు జారీ చేయాలని తెలిపారు. ఆల్టర్నేట్ డ్రైవర్లను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు.

**మొబైల్ టీమ్ చర్యలు:**అన్ని మండపాల వద్ద మొబైల్ టీమ్ తిరుగుతూ పర్యవేక్షణ జరుపుతుందని తెలిపారు.

ప్రత్యేకించి జిల్లా ప్రజలు, భక్తులు శాంతియుతంగా సహకరించాలని, అధికారులతో కలిసి సహకరించాలని కోరారు. అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సమన్వయం తో పనిచేసి ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం ప్రక్రియ విజయవంతం చేయాలనీ ఆన్నారు. ఈ సందర్భంగా , ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని, రోడ్ల మరమ్మతులు, శోభాయాత్రకు అడ్డంకిగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించడం జరుగుతుందని, భద్రతాపరమైన చర్యలకు జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందనీ ఆన్నారు వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రక్రియను ఆద్యంతం అధికారులు పర్యవేక్షణ జరపాలని, గజ ఈతగాళ్ల ను అందుబాటులో ఉంచుతూ క్రేన్, లైటింగ్ వ్యవస్థ, అత్యవసర వైద్యం, అంబులెన్స్, తాగునీరు, బారికేడ్స్ , ట్రాఫిక్ క్రమబద్దీకరణ, టాయిలెట్స్, పారిశుధ్యం వంటి చర్యలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో శోభాయాత్రలో పాల్గొనే వాహనాల్లో ఎటువంటి యాంత్రిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, నిమజ్జన యాత్ర కొనసాగే ప్రాంతాలలో రోడ్లకు ఇరువైపులా కిందికి వేలాడే కరెంటు తీగలు, వంగి ఉన్న చెట్ల కొమ్మలు వంటివి ఏవైనా అడ్డంకులు ఉంటే వాటిని తొలగించాలని, ప్యాచ్ వర్క్ చేపట్టి రోడ్లపై ఏర్పడిన గుంతలను మూసివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువులు, పరీవాహక ప్రాంతాల వద్ద సరిపడా సంఖ్యలో క్రేన్ లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు సందర్భంగా మద్యం విక్రయాలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. ప్రజలు ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకూడదని, ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తేవాలని, ప్రతి ఒక్కరు సంయమనం పాటిస్తూ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఎస్పీ సూచించారు. గణేష్ వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అందరి సమన్వయం తో విజయవంతం చేయాలని , ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో, డీఎస్పీ జీవన్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సలోని, %తీఎశీ% స్రవంతి, జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

# 15 వ్యవసాయ ఆధారిత అంకుర సంస్థలకు PJTAU గుర్తింపు పత్రాలు జారీ

● ఆకుకూరల సాగు కి రోబోల తోడ్పాటు

● మానవ రహిత వ్యవసాయ లక్ష్యసాధనలో తొలి అడుగు



**హైదరాబాద్ సెప్టెంబర్1( సమయం న్యూస్).:** PJTAU పరిధిలోని అగ్రి హబ్ ఇన్నోవేషన్ సెంటర్లో ఈరోజు 15 వ్యవసాయ ఆధారిత అంకుర సంస్థలకు గుర్తింపు పత్రాలని ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అందజేశారు. ఈ సంస్థలు PJTAU అగ్రి హబ్ ఇన్నోవేషన్ సెంటర్ లో విజయవంతంగా సాంకేతిక శిక్షణ పూర్తి చేసుకున్నాయి. అగ్రి హబ్ తరఫున ఇప్పటికి సుమారు 150 అంకుర సంస్థలకు నాబార్డ్ సహాయంతో తోడ్పాటు నందించామని జానయ్య వివరించారు. ఇందులో భాగంగా కూరగాయల సాగులో మానవ ప్రమేయం తగ్గించి రైతులకు తోడ్పాటు అందించేందుకు ఇంజనీరింగ్ విద్యార్థులు ఆవిష్కరించిన రోబో ని అల్దాస్ జానయ్య ఈ కార్యక్రమంలో లాంఛనంగా ప్రారంభించారు. అలాగే గ్రామీణ యువత, అభ్యుదయ రైతులకు చేయూతనందించే కార్యక్రమంలో భాగంగా నాబార్డ్ ఆర్థిక సహకారాన్ని ఆరుగురికి అందజేశారు. అంతేకాకుండా మరో రెండు అంకుర సంస్థలకు ఒక్కొక్క దానికి 40 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం %ూజీూాఖ% అగ్రి హబ్ ద్వారా అందజేశారు. 2047 నాటికి భారతదేశాన్ని వికసిత భారత్ గా రూపొందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాయని అల్దాస్ జానయ్య అన్నారు. ఆ వికసిత్ భారత్ సాధనలో వ్యవసాయానిది కీలకపాత్ర అని ఆయన స్పష్టం చేశారు. దేశ సంపద మూలాలు ఈనాటికీ గ్రామీణ భారతంలో, వ్యవసాయ రంగంలోనే కేంద్రీకృతమై ఉన్నందున ఈ రంగాలకి పెద్దపీట వేసి వ్యవసాయంతో పాటు వ్యవసాయ పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత అంకుర సంస్థలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జానయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా నాబార్డ్ DGM దీప్తి, WE HUB ప్రతినిధి సీత, PJTAU రిజిస్ట్రార్ డాక్టర్ G.E.CH విద్యాసాగర్, AG HUB MD G. వెంకటేశ్వర్లు, వివిధ అంకుర సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# ఏడేళ్లు కనిపించక పోతే చనిపోయినట్లే: తెలంగాణ హైకోర్టు..



**హైదరాబాద్ సెప్టెంబర్ 1( సమయం న్యూస్).::** 21 ఏళ్ల క్రితం అదృశ్యమైన భర్త ఉద్యోగం తనకు ఇవ్వాలని క్యాన్సర్ తో బాధ పడుతున్న మహిళ పిటిషన్ పై హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది.. చట్ట ప్రకారం ఏడేళ్లు ఎవరైనా కనిపించకుండా పోతే చనిపోయినట్లేనని, వారసత్వం కింద కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలని ఇండియన్ బ్యాంకుకు సూచించింది. వారికి రావాల్సిన పదవీ తొలగింపు ప్రయోజనాలు చెల్లించాలని ఖమ్మంకు చెందిన వనపట్ల సుగుణ పిటిషన్ పై జస్టిస్ నగేశ్ భీమపాక ఈ ఆదేశాలు ఇచ్చారు..

# శేరిలింగంపల్లి గణేష్ మండపాలలో పూజలు నిర్వహించిన జరిపేటి జైపాల్...



**శేరిలింగంపల్లి సెప్టెంబర్ 1 సమయం న్యూస్ కే.బీ రాజు,:** శేరిలింగంపల్లి నియోజక వర్గ పరిధిలోని గణేష్ మండపాలను తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జరిపేట జైపాల్ సోమవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా జరిపేటి జైపాల్ మాట్లాడుతూ గణేష్ మండపాల దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించిన నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడమే కాకుండా భక్తి పూర్వకంగా పూజలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, కాంగ్రెస్ అభిమానులు, వడ్డెర సంఘం నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు.

# జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సిద్దిపేట




**సమయం న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 1:** సోమవారం అడిషనల్ డైరెక్టర్ తెలంగాణ డాక్టర్ అమర్ సింగ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ తో కలిసి జిల్లాలోని తీగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాలను టీ హబ్ ను అకస్మికంగా తనిఖీ నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీలో భాగంగా జ్వర పీడిత గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించి వివరాలను అడిగి తెలుసుకుని రికార్డులను, దోమల మందు పిచికారి చేస్తున్న ఇండ్లను ఆయన పరిశీలించారు, గ్రామాల్లోని వీధులు తను స్వయంగా సంతోషిస్తూ దోమలు అభివృద్ధి చెందే ప్రదేశాలను, మురికి కాల్వలను, నీరు నిలువ ఉన్న పాత్రలు, పూల తొట్టిలు, కూలర్లు, వాడిపడేసిన టైర్లు, కొబ్బరి చిప్పలు, కొబ్బరి బోండాలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, రోళ్ళు, పగిలిన సీసాలు, పగిలిపోయిన పాత్రల్లో, టైర్లలో, కొబ్బరి చిప్పల్లో,పాత కుండలు మొదలగు నీటి నిల్వలు ఉండే పాత్రలను ఆయన స్వయంగా పరిశీలించారు. వారు మాట్లాడుతూ, నీటి నిల్వ ఉన్న పాత్రల్లో తోక పురుగులు ఉంటే ఆ నీటిని తొలగించాలని, ఆ నీటిని తొలగించకపోతే, ఈరోజు తోక పురుగులే రేపు దోమలుగా వృద్ధి చెందుతాయని తద్వారా దోమ కాటు వలన వచ్చే వ్యాధులు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా మొదలగు వ్యాధుల నుండి రక్షించుకోవచ్చు అని సూచించారు. ఆరోగ్య సిబ్బంది సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది సమానమయంతో ప్రతిరోజు డ్రై డే తోపాటు, ఇంటింటికి వెళ్లి జ్వర సర్వే తోపాటు ఇతర ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకోవాలని, దోమలు పుట్టకుండా పుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పైన ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్. డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అరుణ్ కుమార్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మలేరియా, వైద్యాధికారులు డాక్టర్ రాజశేఖర్, ఎపిడమాలజిస్ట్ సోఫాన్, హెచ్ ఈ ఓ చక్రధర్, ఎస్ యుఓ శ్రీనివాస్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన మధురవాణి

**భద్రాద్రి కొత్తగూడెం , సెప్టెంబర్ 1: (సమయం న్యూస్):** మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం కొత్తగూడెం ఎంఈఓగా మధురవాణి బాధ్యతలను చేపట్టారు. గత ఎంఈఓగా బాధ్యతలు నిర్వర్తించిన సంఘసేవకుడు డాక్టర్ ప్రభు దయాల్ గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నత అధికారులు కొత్తగూడెం ఎంఈఓగా మధురవాణిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రిటైర్ అయిన డాక్టర్ ప్రభు దయాల్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మధురవాణికి పూర్తి చార్జీని అప్పగించారు.

## బసవ ప్రసాద్ జిల్లా కలెక్టర్ ను మర్యాదా పూర్వకంగా జిల్లా కలెక్ట్ రాహుల్ శర్మ ను కలిశారు.



**భూపాల పల్లి సెప్టెంబర్ 1( సమయం న్యూస్). :** భూపాలపల్లి ఇరిగేషన్ డివిజన్– డిఈగా విధులు నిర్వహిస్తూ ఇంఛార్జి ఈఈగా కొనసాగుతున్న బసవ ప్రసాద్ కు పదోన్నతి కల్పిస్తూ ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు.ఆ ఉత్తర్వుల మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పదవి బాధ్యతలు స్వీకరించిన బసవ ప్రసాద్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ను సోమవారం ఐడిఓసి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బసవ ప్రసాద్ కు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలియజేసి, భవిష్యత్తు కార్యక్రమాలలో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్తలు తప్పనిసరి - సబ్ కలెక్టర్ హెచ్చరిక



**కామారెడ్డి, సెప్టెంబర్ 1 (సమయం న్యూస్):** జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ఐఎఎస్ ఆదేశించారు. సెప్టెంబర్ 2వ తేదీ నుండి వర్షాలు తీవ్రతరం కానున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.డివిజన్ పరిధిలో ఇప్పటికే అధిక వర్షాల కారణంగా పలు ఇబ్బందులు తలెత్తినందున, ముంపు ముప్పు ఉన్న ప్రాంతాలు, ఓవర్ ఫ్లో అయ్యే ప్రాజెక్టులు, చెరువులు, ప్రమాదకరంగా ప్రవహించే వాగులు, వంకలు, తడిసిపోయిన పాత ఇండ్లు, భవనాలు, ప్రమాదకరంగా నిలిచిన విద్యుత్ స్తంభాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసి ప్రాణనష్టం జరగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు.గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల స్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు డివిజన్ మరియు జిల్లా అధికారులకు తెలియజేయాలని డాక్టర్ కిరణ్మయి స్పష్టం చేశారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని సూచించారు.చేపల వేటకు వెళ్లేవారు, పశువులు, గొర్రెల కాపరులు నీటి పరివాహక ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె హెచ్చరించారు.

## సందర్శకుల కోసం సీపీ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక లౌంజ్ ప్రారంభం



**హన్మకొండ సెప్టెంబర్1( సమయం న్యూస్). :** వరంగల్ పోలీస్ కమిషనర్ క్యాంపు కార్యాలయంలో సీపిని కలిసేందుకు వచ్చే సందర్శకుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గది (లౌంజ్)ని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం ప్రారంభించారు.

సందర్శకులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ లౌంజ్ ఏర్పాటు చేయబడింది. ఇందులో కూర్చునే సౌకర్యాలు, త్రాగునీటి సదుపాయం, పత్రికలు వంటి అవసరమైన సౌకర్యాలు కల్పించబడ్డాయి. కమిషనర్ మాట్లాడుతూ – "ప్రజలు పోలీస్ కార్యాలయానికి వచ్చే సందర్భంలో వేచి ఉండే సమయంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ లౌంజ్ ఉపయోగపడుతుంది. ప్రజలకు సౌకర్యం కల్పించడం మా ప్రాధాన్యత" అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ లు రవి, ప్రభాకర్ రావు, శ్రీనివాస్, ఏసీపీలు జితేందర్ రెడ్డి, నాగయ్య, డేవిడ్ రాజు తో ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



**వికారాబాద్:సెప్టెంబర్,01.09.25(సమయం న్యూస్) :** ఎస్సీ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ అడిషనల్ డైరెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న సి. శ్రీధర్ గారికి వికారాబాద్ జిల్లా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ తరుపున హైదరాబాద్ కమిషసినరేట్ లో శుభ్కాంక్షలు తెలియజేయడం జరిగింది. ఇందులో పాల్గొన్నవారు జిల్లా అధ్యక్షులు శుక్ర వర్ధన్ రెడ్డి రాజేష్ శంకర్ రవీందర్ హనుమంత్ రెడ్డి మాధవి వరలక్ష్మి రాధిక పాల్గొన్నారు.

# నానో యూరియాను రైతులు పెద్ద ఎత్తున వినియోగించాలి

- యూరియా కంపెనీ
- ప్రజల తో మాట్లాడి ధర తగ్గింపు
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, సెప్టెంబర్ -01( సమయం న్యూస్).:** ప్రస్తుతం యూరియా కోరుతూ ఉన్న నేపథ్యంలో వానాకాలం సీజన్ లో రైతులు నానో యూరియా ను పెద్ద ఎత్తున వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.రైతులకు సౌకర్యార్థంగా ఉండేందుకు యూరియా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ధర రూ.250 ఉన్న యూరియాను రూ.150 రూపాయలకే ఇప్పించేలా (సుమారు 75 రూపాయలు తగ్గింపు) చేయడం జరిగిందని ఇట్టి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుత వానాకాలం సీజన్ లో ప్రభుత్వము యూరియా బస్తాలు అధికంగా సరఫరా చేసినప్పటికీ కొంత మంది రైతులు ముందస్తు కొనుగోలు చేసి నిల్వ చేసుకోవడం వల యూరియా కొరత ఏర్పడుతుందని అన్నారు. రైతులు డిఏపి పొటాష్ ఎరువులు వాడకుండా యూరియా నే విపరీతంగా వాడుతున్నారని, దీని వలన పంట, నేల మరియు వాతావరణము ఏర్పడుతుందని, యూరియా బస్తాలు వేసేటప్పుడు పొలం బురద పదను ఉండాలని, కాని అందరు అందరి రైతులు పొలంలో నీరు ఉన్నప్పుడే యూరియా చళ్ళుతున్నారని, ఇలా చల్లడం వలన, మొక్కకు నత్రజని పోషకం అందక పోవడం తో ఇక రైతు విపరీతమైన డోస్ పెంచి వాడుతున్నారని కలెక్టర్ తెలిపారు.వరిలో ఒక ఎకరానికి నాలుగు నుంచి ఐదు బస్తాలు వాడుతున్నారని, ఇది చాలా ప్రమాదకరమైన విషయమని అన్నారు. యూరియాను అందరూ అధిక మొత్తంలో వాడడం ముందస్తుగా కొనుగోలు చేసుకోవడం వల్ల కృత్రిమ ఏర్పడి చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యూరియా కొరత సమస్య పరిష్కారానికి ఉత్తమమైన మార్గమే నానో యూరియా( ద్రావ రూపంలో ఉంటుంది )వాడకమని, దీన్ని పంట పై బాగా ఆకులు తడిసెటట్లుగా పిచికారి చేస్తే సరిపోతుందని, చేతి పంపు /పవర్ స్ప్రేయర్ తో గాని డ్రోన్ తో గాని పిచ్చికారి చేసుకోవచ్చు మెల్లగా ఎక్కువ రోజులు పని చేసి అధిక దిగుబడులు ఇస్తుందని అన్నారు. వరిలో రెండో డోసు, మూడో డోసు కొరకు ఈ నానో యూరియా వాడి మంచి ఫలితాలు పొందవచ్చని, జిల్లాలో ప్రభుత్వ చోరువతో ఇట్టి నానో యూరియాం 500 బాటిల్లు 150 రూపాయలకే లభిస్తుందని, కావున ఇఫ్కో నానో యూరియా వాడి అధిక దిగబడులు పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నిజాంసాగర్ పటిష్టమైన ప్రాజెక్టు

## ప్రాజెక్టు పరిశీలన చేసిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి





**కామారెడ్డి, సెప్టెంబర్ 1(సమయం న్యూస్) :** తెలంగాణలో ప్రాధాన్యం కలిగిన నీటిపారుదల ప్రాజెక్టు నిజాంసాగర్ మళ్లీ నిండిపోయింది. పోచారం, ఘనపూర్ వైపు నుండి వరద నీరు అధికంగా చేరడంతో గేట్లు ఎత్తి మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించడానికి వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి సోమవారం ప్రాజెక్టును సందర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు కూడా ఆయన వెంట ఉన్నారు.ప్రాజెక్టులో నీటి ప్రవాహం, నిల్వలు, గేట్ల నిర్వహణ, రక్షణ చర్యలపై ఇంజనీర్లను అడిగి వివరాలు సేకరించారు. ప్రాజెక్టు పటిష్టంగా ఉందని ఎటువంటి ఇబ్బందులు లేవని ఇంజనీర్లు తెలియజేయడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. నిజాంసాగర్ పటిష్టమైన ప్రాజెక్టు అని ఆయన ప్రజలకు స్పష్టం చేశారు.ఈ సంవత్సరం కూడా నిజాంసాగర్ పూర్తిస్థాయిలో నిండిందని, వానాకాలం యాసంగి పంటలకు సాగునీరు సమృద్ధిగా అందుబాటులో ఉంటుందని తెలిపారు. రైతులు సాగునీటిని వృథా చేయకుండా సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.ప్రపంచంలోనే తొలి భారీ నీటిపారుదల ప్రాజెక్టు నిజాంసాగర్ అని గుర్తుచేశారు. శతాబ్దానికి పైగా నిలకడగా కొనసాగుతున్న ఈ ప్రాజెక్టు తెలంగాణ రైతుల కృషికి ప్రాణాధారమని ఆయన పేర్కొన్నారు.వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రాబోయే రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పెద్ద ఎత్తున నీటిని మంజీరాలోకి విడుదల చేయాల్సి వస్తుందని అన్నారు. ఆ సందర్భంలో నది పరివాహక గ్రామాల ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు.నిజాంసాగర్ కేవలం నీటిపారుదల ప్రాజెక్టు మాత్రమే కాకుండా తెలంగాణలో నీటి చరిత్రకు ప్రతీకగా నిలుస్తుందని పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## నది పరివాహక గ్రామం సుంకిని గ్రామాన్ని పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ డీసీసీబీ చైర్మన్ శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి

**పోతంగల్ సెప్టెంబర్1( సమయం న్యూస్). :** గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బాన్సువాడ నియోజకవర్గంలో బీర్కూర్, పోతంగల్ మండల కేంద్రాలలో బ్రిడ్జిల వద్ద మంజీరా నది ప్రవాహాన్ని పరిశీలించారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో పోతంగల్ మండలంలోని ముంపు ప్రాంతాలను భాస్కర్ రెడ్డి పరిశీలించారు. పోతంగల్ మండలం సుంకిని గ్రామంలో గ్రామానికి ఆనుకుని పారుతున్న మంజీరా నది ప్రవాహాన్ని పరిశీలించిన ఆయన ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రెండు రోజులుగా బాన్సువాడ నియోజకవర్గ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే తనకు కానీ స్థానిక నాయకులకు, అధికారులకు,పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద పెరుగుతున్నందున మంజీరా నదిలో నీటిని విడుదల చేస్తున్నారని మంజీరా నది ఉధృతి మరింత పెరుగనుందని ప్రజలకు తెలిపారు. మంజీరా పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మంజీరా నది ఉధృతి తగ్గేవరకు ప్రజలు అటువైపు వెళ్ళొద్దని రైతులు పొలాలకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలకు పార్టీ కార్యకర్తలు అండగా ఉండాలని సమస్య ఉన్నవారికి భరోసా కల్పించాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు.

## బడి ఈడు పిల్లలను అభినందించిన గ్రామస్తులు

**చిన్న వయసులోనే సేవ చేయటం మా అదృష్టం అంటున్న తల్లిదండ్రులు**



**వెల్దుర్తి సెప్టెంబర్ 1, (సమయం న్యూస్):** వెల్దుర్తి మండల కేంద్రంలో సిద్ధివినాయక యూత్ సభ్యులు నిలిపిన వినాయక మండపంలో బడి ఈడు పిల్లలంతా కలిసి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులు అలాగే సిద్ధి వినాయక యూత్ కమిటీ సభ్యులు పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా పూర్తి చేశారు. ఆ తరువాత అక్కడికి వచ్చిన గ్రామస్తులు అలాగే కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పిల్లలందరినీ అభినందనల వెల్లువలు కురిపించారు. ఇంత చిన్న వయసులోనే భక్తి భావం ఉండడం అలాగే చదువుతోపాటు, అందరికీ అన్న ప్రసాదం అందించాలని సంకల్పంతో ఈ కార్యక్రమం చేయడం చాలా సంతోషమని కమిటీ సభ్యులు గ్రామస్తులు పిల్లలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెన్నవరం శ్రీధర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మైపాల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మల్లేశం చారి, విక్రమ్ సింగ్, ప్రకాష్, కోటేశ్వరరావు, శేఖర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## కడా అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించకుండా పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.





**వికారాబాద్: కొడంగల్, సెప్టెంబర్(సమయం న్యూస్):** సోమవారం కడా అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూకడా అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల బడ్జెట్ ను కేటాయించి నీధులు మంజూరు చేయడం జరిగింది అన్నారు.మంజూరైన పనులకు ప్రొసీడింగ్స్ ఇచ్చినప్పటికీ పనులు మొదలు పెట్టకపోవడానికి గల కారణాలను సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.పనులు వేగవంతం కాకుండా జాప్యం జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు.అభివృద్ధి పనులు చేసే క్రమంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్త లతో పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.పాఠశాలల్లో చేపట్టవలసిన మోడ్రన్ టాయిలెట్ ల నిర్మాణాలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా కేజీబీవీ లలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సౌకర్యవంతగా ఉండేందుకు పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్ల నిర్మాణాలు చేపట్టే క్రమంలో ముందస్తుగానే ఇరిగేషన్, విద్యుత్తు, మిషన్ భగీరథ, అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని పనులకు పూనుకోవాలని కలెక్టర్ తెలిపారు.మున్సిపాలిటీలో చేపట్టే పనులు నాణ్యతతో ఆదర్శంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాస్ రెడ్డి ,ఇఇ సత్యనారాయణ రెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు,మిషన్ భగీరథ ఇఇ రవి కుమార్,జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్,మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, లతో పాటు ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ ద్రవిడ్‌ను జట్టు నుండి వెళ్లగొట్టారు

## ఏబీ డివిలియర్స్ సంచలన వ్యాఖ్యలు






రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి రాహుల్ ద్రవిడ్ తప్పుకోవడంపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఫ్రాంచైజీలో మరింత ఉన్నతమైన పదవిని ఆఫర్ చేసినా ద్రవిడ్ స్వీకరించలేదని రాజస్థాన్ రాయల్స్ చెప్పినా.. నెటిజన్లు నమ్మడం లేదు. ద్రవిడ్ నిర్ణయాలకు ఫ్రాంచైజీ విలువ ఇవ్వకపోవడంతోనే అతను ఈ నిర్ణయం తీసుకున్నాడని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంజూ శాంసన్‌తో నెలకొన్న విభేదాలు కూడా కారణమని కామెంట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ సంచలన వ్యాఖ్యలు చేశాడు.రాజస్థాన్ రాయల్స్ జట్టులో నుంచి రాహుల్ ద్రవిడ్‌ను పొమ్మన లేక పొగ బెట్టారని తెలిపాడు. వచ్చే సీజన్ నాటికి కొత్త ఆలోచనలతో రాజస్థాన్ రాయల్స్ సిద్ధమవుతుందని, అందుకు అడ్డుగా ఉన్న రాహుల్ ద్రవిడ్‌కు అత్యున్నత పదవి ఆఫర్ చేసి జట్టుకు దూరం చేయాలనుకున్నదని అభిప్రాయపడ్డాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ద్రవిడ్ వ్యవహారంపై మాట్లాడిన ఏబీడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.'ఫుట్‌బాల్ లీగుల్లో ఆటగాళ్లతో పాటు కోచ్‌లు, మేనేజర్లు కూడా తీవ్ర ఒత్తిడిలో ఉంటారు. అత్యుత్తమ ప్రదర్శనతో ఛాంపియన్‌గా నిలవాలని భావిస్తారు. అలా జరగకపోతే మాత్రం అభిమానుల నుంచి తీవ్ర విమర్శలు వస్తాయి. అలాగే టీమ్‌మేనేజ్‌మెంట్ నుంచి కూడా సూటి పోటీ మాటలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. రాహుల్ ద్రవిడ్ విషయంలో ఏం జరిగిందో తెలియదు. నాకు తెలిసిన సమాచారం ప్రకారం అతనికి వేరే బాధ్యతలు అప్పగించాలని ఫ్రాంచైజీ భావించింది. అయితే అందుకు ద్రవిడ్ అంగీకరించలేదు.అంటే అతన్ని హెడ్ కోచ్ పదవి నుంచి తప్పించాలని రాజస్థాన్ రాయల్స్ భావించింది. వచ్చే సీజన్ నాటికి కొత్త ఆలోచనలతో రావాలని రాజస్థాన్ భావిస్తుందేమో. అందుకోసం తమ కోచింగ్ టీమ్‌లో మార్పులకు శ్రీకారం చుట్టి ఉండొచ్చు. డగౌట్‌కు దూరం కావడం అతనికి ఇష్టం లేకపోవడం కూడా సమస్యగా మారి ఉంటుంది. అసలేం జరిగిందో ఇప్పుడు తెలియకున్నా.. భవిష్యత్తులో తప్పకుండా తెలుస్తుంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ వ్యూహాలు గొప్పగా లేవు. కొన్నిసార్లు మార్పులు కలిసొస్తాయి. కానీ ఈసారి రాజస్థాన్‌కు నష్టమే ఎక్కువ కలిగింది. ఒకరిద్దరిని మారిస్తే ఇబ్బందేమి ఉండదు. కానీ, బల్క్‌గా ఆటగాళ్లను తీసేయడమనేది చాలా ప్రభావం చూపించింది.'అని ఏబీడీ అభిప్రాయపడ్డాడు.

## డివిలియర్స్ టాప్ 5 లిస్ట్‌లో విరాట్‌కు నో ప్లేస్



సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్- టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ క్రికెట్?లో బెస్ట్? ఫ్రెండ్స్. ఈ ఇద్దరూ అనేక సంవత్సరాలు ఐపీఎల్?లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీకి కలిసే ఆడారు. వ్యక్తిగతంగానూ ఏబీడీ- విరాట్‌కు మంచి అనుబంధం ఉంది. బహిరంగంగా ఏబీడి ఇప్పటికే అనేకసార్లు విరాట్ ప్రపంచంలో అత్యుత్తమ క్రికెటర్ అని కొనియాడాడు. కానీ తాజాగా తన టాప్ 5 బెస్ట్ క్రికెటర్ల లిస్ట్‌లో మాత్రం విరాట్‌కు స్థానం కల్పించలేదు. తాను చూసిన అత్యుత్తమ క్రికెటర్లలో విరాట్ పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం. మరి ఏబీడి చెప్పిన బెస్ట్ క్రికెటర్లు ఎవరంటే ఏబీ డివిలియర్స్ అంతర్జాతీయ క్రికెట్‌లో 14ఏళ్లపాటు ఆడాడు. తన కెరీర్‌లో అనేకమంది లెజెండ్స్‌తో కలిసి ఆడాడు. అయితే ఏబీడి రీసెంట్?గా ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఇందులో తన టాప్- 5 క్రికెటర్ల గురించి చెప్పాడు. ఈ జాబితాలో సౌతాఫ్రికా దిగ్గజం జాక్వెస్ కలీస్, ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ ఆండ్రూ ఫ్లింటాఫ్, ఆసీస్ స్టార్ షేన్ వార్న్, క్రికెట్ గాడ్ సచిన్ తెందూల్కర్, మహ్మద్ ఆసిఫ్ పేర్లు చెప్పారు.అయితే విరాట్ కోహ్లీ పేరు లేకుండా డివిలియర్స్ తన టాప్- 5 ప్లేయర్ల లిస్ట్ చెప్పేశాడు. ఈ లిస్ట్?లో విరాట్ కోహ్లీకి అతడు స్థానం కల్పించని విషయాన్ని మర్చిపోయాడు. ఈ విషయాన్ని తర్వాత ఆదిల్ రషీద్ గుర్తు చేయడంతో ఏబీ డివిలియర్స్ సారీ చెప్పాడు. 'జాక్వెస్ కలీస్, ఆండ్రూ ఫ్లింటాఫ్, మహ్మద్ ఆసిఫ్, షేన్ వార్న్, సచిన్ తెందూల్కర్. ముఖ్యంగా తెందూల్కర్ బ్యాటింగ్ చూడ్డానికి చాలా అద్భుతంగా ఉంటుంది. జాక్వెస్ కలీస్ బెస్ట్ ఆల్‌రౌండర్. మహ్మద్ ఆసిఫ్ మంచి పేసర్. అలాగే షేన్‌వార్న్ బౌలింగ్ ఆడటాన్ని నేను బాగా ఆస్వాదిస్తాను. అతడి బౌలింగ్‌లో నేను ఎప్పుడు కూడా ఇబ్బంది పడలేదు. ఆండ్రూ ఫ్లింటాఫ్ గొప్ప ఆటగాడు. అతడు ఎడ్జ్‌బాస్టన్‌లో కలీస్‌కు వేసిన యార్కర్ గ్రేట్. అది నేను చూసిన బంతుల్లో దీ బెస్ట్" అని డివిలియర్స్ అన్నాడు.ఇటీవల ముగిసిన 2025 వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్?లో డివిలియర్స్, సౌతాఫ్రికా విజేతగా నిలవడంలో కీలకంగా వ్యవహరించాడు. ముఖ్యంగా పాకిస్థాన్‌తో ఫైనల్‌లో ఏకంగా సెంచరీతో రఫ్ఫాడించాడు. కేవలం 60 బంతుల్లోనే 120 పరుగులు చేశాడు. ఈ టోర్నీలోనే డివిలియర్స్? మూడో సెంచరీ కావడం గమనార్హం. ఫైనల్?లో 196 పరుగుల లక్ష్యాన్ని సౌతాఫ్రికా 16.5 ఓవర్లలో 9 వికెట్లు మిగిలి ఉండగానే ఛేదించింది. ఈ ఈవెంట్‌లో డివిలియర్స్ అత్యధిక పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎంపికయ్యాడు. ఆరు ఇన్నింగ్స్‌ల్లో మూడు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ సాధించాడు.

## 7 గంటల 19 నిమిషాలపాటు జరిగిన బాక్సింగ్ మ్యాచ్

### 110 రౌండ్ల పాటు కొనసాగిన అతిపెద్ద ఫైట్


క్రీడా ప్రపంచంలోనే ఎప్పటికీ చెరిగిపోని రికార్డులు కొన్ని ఉంటాయి. అందులో 1893లో న్యూ ఆర్లియన్స్ వేదికగా జరిగిన బాక్సింగ్ మ్యాచ్ మొదటిస్థానంలో ఉంటుంది. న్యూ ఆర్లియన్స్ వేదికగా జరిగిన ఆ పోరు బాక్సింగ్ హిస్టరీలో అతిపెద్ద మ్యాచ్?గా నిలిచిపోయింది. బాక్సింగ్ రింగ్?లో రెండు లేదా కష్టం మీద మూడు గంటలు బాక్సర్లు ఫైట్ చేస్తారు. కానీ న్యూ ఆర్లియన్స్ మ్యాచ్? మాత్రం ఏకధాటిగా 110 రౌండ్ల పాటు సాగింది. దాదాపు 7 గంటల 19 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌ను ప్రేక్షకులు చాలా ఉత్కంఠతో అలానే చూడసాగారు. ఈ మ్యాచ్?లో బాక్సింగ్? రింగ్‌లో తలపడ్డది అమెరికాకు చెందిన ఆండీ బోవెన్, చికాగోకు చెందిన జాక్ బర్క్. బోవెన్ అప్పట్లో వరల్డ్ లైట్‌వెయిట్ ఛాంపియన్. అతని శరీర నిర్మాణం చిన్నదే అయినా, తెగింపు, స్టామినా అతని పెద్ద ఆయుధాలు. మరోవైపు బర్క్ ఫాస్ట్ మువ్‌మెంట్స్‌తో ప్రత్యర్థులను అటకెక్కించే స్టైల్ కలిగిన బాక్సర్. మొదట బోవెన్‌కు వేరొక బాక్సర్‌తో పోటీ ఖరారైంది. కానీ ఆ బాక్సర్ తప్పుకోవడంతో బర్క్ రింగ్‌లోకి దిగాడు.ఈ గేమ్?లో వీరిద్దరు ప్రత్యర్థులుగా మారారు.1893 ఏప్రిల్ 6న న్యూ ఆర్లియన్స్‌లో ఈ మ్యాచ్ జరిగింది. ప్రారంభంలో ఇరువురూ దూకుడుగా పోరాడారు. కానీ ఒక్కో రౌండ్ గడుస్తుండగా అలసట మొదలైంది. అయినప్పటికీ ఆ జోష్?లో ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం ఆపలేదు. ఒకొకటిగా రౌండ్స్? పెంచుకుంటూ చివరికి 110 రౌండ్ల వరకు పోరు హోరాహోరీగా సాగింది. అంత సేపు పోరాడిన తర్వాత ఇద్దరికీ నిలబడే శక్తి లేకపోవడంతో, కుర్చీలో కూర్చున్నారు. అదే స్థితిలో మ్యాచ్ ముగిసింది. మొదట నో-కాంటెస్ట్‌గా ప్రకటించగా, తర్వాత ఈ గేమ్ డ్రా గా రికార్డు అయ్యింది. ఈ పోరులో బర్క్ రెండు చేతుల్లో ఎముకలన్నీ విరిగిపోయేంతగా ఆడి గాయపడ్డాడు. ఆరు వారాలపాటు పూర్తిగా బెడ్? రెస్ట్? తీసుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ ఆ తరువాత కూడా తన బాక్సింగ్ కెరీర్?ను కొనసాగించాడు. మరోవైపు బోవెన్ మాత్రం తన కెరీర్‌ను కొనసాగించిన నాలుగేళ్లకే కొన్ని కారణాల వల్ల ప్రాణాలు కోల్పోయాడు. 1897లో జార్జ్ లావిగ్నేతో పోటీలో ఒక దెబ్బకు పడిపోయిన బోవెన్ మళ్లీ లేచి నిలబడలేక పోయాడు.జాక్ బర్క్ 1869 జనవరి 1లో చికాగోలో జన్మించాడు. మొత్తం 12 పోటీల్లో 5 విజయాలు సాధించాడు. 1913లో 44 ఏళ్ల వయసులో కన్నుమూశాడు. ఆండీ బోవెన్ - 1867 మే 3న జన్మించిన బోవెన్, 1887లో బాక్సింగ్ రంగంలోకి వచ్చాడు. తొలి 14 పోటీల్లో ఓటమి చూడలేదు. 1890లో వరల్డ్ టైటిల్ గెలుచుకున్నాడు. కానీ 1897లో జరిగిన పోటీలో ప్రాణాలు కోల్పోయాడు.ఇప్పటి బాక్సింగ్‌లో 12 రౌండ్లు అంటేనే చాలా కష్టంగా అనిపిస్తుంది. కానీ ఆ కాలంలో 110 రౌండ్ల వరకు పోరాడటం నిజంగా అద్భుతం. ఈ మ్యాచ్ ఇప్పటికీ బాక్సింగ్ చరిత్రలో లాంగెస్ట్ బాక్సింగ్ రికార్డ్?గా రికార్డు బుక్‌లో నిలిచిపోయింది.

## క్వార్టర్స్ చేరిన అల్కరాజ్, జకోవిచ్, సబలెంకా!

ప్రతిష్టాత్మక గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ యూఎస్ ఓపెన్ 2025లో టాప్ సీడ్ ఆటగాళ్లు కార్లోస్ అల్కరాజ్, నోవాక్ జకోవిచ్, టేలర్ ఫ్రిట్జ్, అరీనా సబలెంకా, జెస్సికా పెగులా క్వార్టర్ ఫైనల్ చేరారు. జర్మనీ స్టార్, మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు మాత్రం బిగ్ షాక్ తగిలింది. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-4, 6-7(7/9), 4-6, 4-6 తేడాతో 25వ సీడ్ ప్లేయర్ ఫెలిక్స్ అలియాసిమ్(కెనడా) చేతిలో ఓటమిపాలయ్యాడు. తొలి సెట్ గెలిచి శుభారంభం చేసిన జ్వెరెవ్ ఆ తర్వాత తడబడ్డాడు. అనవసర తప్పిదాలతో ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం కల్పించాడు. దాంతో వరుసగా మూడు సెట్లు నెగ్గిన అలియాసిమ్.. జ్వెరెవ్‌పై సంచలన విజయాన్నందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అలియాసిమ్ 10 ఏస్‌లతో పాటు 50 విన్నర్లు కొట్టాడు. మరో మ్యాచ్‌లో 7వ సీడ్, సెర్బియా దిగ్గజం నోవాక్ జకోవిచ్ 6-3, 6-3, 6-2 తేడాతో జర్మనీకి చెందిన క్వాలిఫైయర్ జెన్-లెనార్డ్ స్ట్రఫ్‌పై సునాయస విజయాన్నందుకున్నాడు. గంట 50 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో జకోవిచ్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. సర్వీస్‌లను సులభంగా గెలుచుకుంటూ ముందుకు సాగాడు.జకోవిచ్ ముఖ్యంగా తన రిటర్న్ గేమ్ మీద ఫోకస్ పెట్టాడు. స్ట్రఫ్ సర్వీస్‌ను చాలాసార్లు బ్రేక్ చేసిన జకోవిచ్.. స్ట్రఫ్‌ను ఏ దశలోనూ కోలుకోనివ్వలేదు. ఇక స్ట్రఫ్ పవర్‌ఫుల్ ఫోర్‌హ్యాండ్, సర్వీస్‌తో జకోవిచ్‌ను ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించినా.. జకోవిచ్ తన డిఫెన్స్, వ్యూహాత్మక షాట్‌లతో వాటిని తిప్పికొట్టాడు. ఈ మ్యాచ్‌లో జకోవిచ్ 6 ఏస్‌లు, 32 విన్నర్లు కొట్టగా.. 2 డబుల్ ఫాల్ట్స్, 15 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు స్ట్రఫ్ 10 ఏస్‌లతో పాటు 28 విన్నర్లు కొట్టాడు. 4 డబుల్ ఫాల్ట్స్, 35 అనవసరం తప్పిదాలు చేశాడు.స్పెయిన్ స్టార్, రెండో సీడ్ కార్లోస్ అల్కరాజ్ 7-6 (3), 6-3, 6-4 తేడాతో ఫ్రెంచ్ ప్లేయర్ ఆర్థర్ రిండర్‌క్నెచ్‌పై విజయం సాధించాడు. 2 గంటల 15 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ మెరుగైన ప్రదర్శన చేశాడు. తొలి సెట్‌లో కొద్దిగా పోటీ ఎదురైనప్పటికీ టై-బ్రేక్‌లో ఆ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. పవర్‌ఫుల్ ఫోర్ హ్యాండ్ షాట్స్‌తో పాటు వేగవంతమైన కదలికలతో ప్రత్యర్థిని నిలవరించాడు. చాలా సునాయసంగా రెండో, మూడో సెట్‌లను గెలుచుకొని మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

## భారత క్రికెట్‌కు రూ. 7 వేల కోట్ల నష్టం!

### ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ బిల్లుతో నష్టాలబాట




కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ బిల్లుతో భారత క్రికెట్‌కు భారీ నష్టం వాటిల్లనుంది. దాదాపు రూ. 7 వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోనుంది. ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ బిల్లు కారణంగా ఫాంటసీ స్పోర్ట్స్ సంస్థలు, ఆన్‌లైన్ మనీ-బేస్డ్ గేమ్ యాప్స్ పూర్తిగా తమ కార్యకలపాలను నిలిపేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆన్‌లైన్ గేమింగ్ సంస్థల నుంచే భారత క్రికెట్‌కు భారీగా ప్రకటనలు వచ్చాయి. కానీ తాజా బిల్లు కారణంగా ఆ ఆదాయాన్ని పూర్తిగా కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ బిల్లు కారణంగా బ్రాడ్‌కాస్టర్లు, స్ట్రీమింగ్ ఫ్లాట్‌ఫామ్స్ తీవ్రంగా దెబ్బతింటాయని అడ్వర్టైజింగ్ రంగం నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ బిల్లు కారణంగా ఈ రంగమే అతిపెద్ద సవాల్ ఎదుర్కొనుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ బిల్లు కారణంగా టీమిండియా జెర్సీ స్పాన్సర్‌గా ఉన్న డ్రీమ్ 11 బీసీసీఐతో ఉన్న రూ. 358 కోట్ల ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఐపీఎల్‌కు స్పాన్సర్‌షిప్ చేస్తున్న మై 11 సర్కిల్‌తో కుదిరిన రూ. 625 కోట్ల ఒప్పందం కూడా రద్దయ్యే అవకాశాలు ఉన్నాయి.డ్రీమ్ 11 నిష్క్రమణతో టీమిండియా జెర్సీ స్పాన్సర్ లేకుండా ఆసియా కప్ 2025 ఆడనుంది. కొత్త స్పాన్సర్ కోసం అన్వేషణ ప్రారంభించిన బీసీసీఐ.. 2025-28 కాలానికి రూ. 452 కోట్లు రాబట్టాలనే లక్ష్యంతో ఉంది. ఫాంటసీ స్పోర్ట్స్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్న ఐపీఎల్ ఫ్రాంచైజీలు కూడా తీవ్ర నష్టాలను ఎదుర్కోనున్నాయి. ఫాంటసీ స్పోర్ట్స్ కంపెనీలు ఏటా రూ. 5,000 కోట్లను ప్రకటనల కోసం ఖర్చు చేయగా.. ఇతర రియల్-మనీ గేమింగ్ ఆపరేటర్లు మరో రూ. 2000 కోట్లు ఖర్చు చేశాయి. దాంతో మనీ-బేస్డ్ ఆన్‌లైన్ గేమ్స్ కంపెనీల ప్రకటనల వ్యయం రూ. 7,000 కోట్లకు చేరుకుంది. భారత క్రికెట్‌కే కాకుండా ఇతర క్రీడలకు, ఫ్రాంచైజీ లీగ్స్‌తో పాటు డిజిటల్ ఫ్లాట్‌ఫామ్స్ గూగుల్, మెటా భారీ నష్టాలను ఎదుర్కోనున్నాయి. భారత ప్రకటనల పరిశ్రమ కూడా కుదేలవ్వనుంది. భారతదేశ స్పోర్ట్స్ మీడియా ఎకో సిస్టమ్‌లో అతిపెద్ద ఆపరేటర్ అయిన జియోస్టార్ భారీగా నష్టపోయే అవకాశం ఉంది.

## లలిత్ మోదీపై హర్భజన్‌సింగ్ ఫైర్!



ఐపీఎల్ మాజీ ఛైర్మెన్ లలిత్ మోదీపై భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 18 ఏళ్ల క్రితం జరిగిన ఘటనను మళ్లీ ఎందుకు గుర్తు చేస్తున్నారని ప్రశ్నించాడు. దీని వెనుక స్వార్థపూరిత ఉద్దేశం ఉండవచ్చని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ అరంగేట్ర సీజన్(2008)లో మాజీ పేసర్ శ్రీశాంత్, హర్భజన్ సింగ్ మధ్య చోటు చేసుకున్న చెంపదెబ్బ ఘటనకు సంబంధించిన వీడియోను లలిత్ మోదీ తాజాగా విడుదల చేశాడు.ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైఖేల్ క్లార్క్ పాడ్ కాస్ట్‌లో పాల్గొన్న లలిత్ మోదీ.. 18 ఏళ్ల సీక్రెట్‌గా ఉన్న వీడియోను బయటపెట్టాడు. ఐపీఎల్ టోర్నీ భవిష్యత్తు నేపథ్యంలో ఈ వీడియోను బయటకు రాకుండా చేయాలని అప్పట్లో నిర్ణయించారు. కానీ లలిత్ మోదీ తాజాగా వెలుగులోకి తేవడంతో ఈ వీడియో వైరల్‌గా మారింది. శ్రీశాంత్ చెంపపై హర్భజన్ సింగ్ కొట్టడం ఈ వీడియోలో స్పష్టంగా కనిపించింది.తాజాగా ఈ వీడియోపై స్పందించిన హర్భజన్ సింగ్.. మరిచిపోయిన ఘటనను మళ్లీ గుర్తు చేయాల్సిన అవసరం ఏం ఉందని ప్రశ్నించాడు. 'ఈ వీడియో లీకైన విధానం తప్పు. ఇలా చేయాల్సింది కాదు. దీని వెనుక వారి స్వార్థపూరిత ఉద్దేశం ఉంది. 18 ఏళ్ల క్రితం జరిగిన ఆ ఘటనను అంతా మర్చిపోయారు. కానీ మళ్ళీ గుర్తు చేసే ప్రయత్నం చేశారు. ఆ ఘటన గురించి తలుచుకుంటే నాకు బాధగా ఉంటుంది. ఆటగాళ్లు భావోద్వేగాలకు గురవ్వడం సహజం. కొన్నిసార్లు పొరపాట్లు జరుగుతుంటాయి. అయితే ఆ రోజు నేను అలా ప్రవర్తించాల్సింది కాదు. ఇప్పటికీ ఆ ఘటన పట్ల నేను సిగ్గుపడుతున్నాను. నేను ఘోర తప్పిదం చేశాను. మనుషులన్నప్పుడు తప్పులు చేయడం సహజం. అందులో నేను ఒకటి చేశాను. ఇలాంటి పొరపాట్లు మళ్లీ చేయకుండా చూసుకోవాలని ఆ గణేశుడిని కోరుకున్నాను.'అని హర్భజన్ సింగ్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

# ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబోలో డ్రాగన్

## హీరోయిన్‌గా రుక్మిణీ వసంత్ ఫిక్స్





జూనియర్ ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబోలో వస్తున్న డ్రాగన్ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం స్పీడ్ గా జరుపుకుంటోంది. అయితే ఇందులో ఎవరు హీరోయిన్ అనే ప్రశ్న అందరిలోనూ ఉంది. ఈ మధ్య ఓ పేరు బాగా వినిపిస్తోంది. కానీ ఆమెనే తీసుకుంటున్నారా లేదా అనేది ఒక సస్పెన్స్. దానికి నిర్మాత క్లారిటీ- ఇచ్చేశాడు. ప్రస్తుతం తమిళ హీరో శివకార్తికేయన్ హీరోగా రుక్మిణి వసంత్ హీరోయిన్ గా వస్తున్న మూవీ మదరాసి. సెప్టెంబర్ 5న రిలీజ్ అవుతున్న ఈ సినిమా ఈవెంట్ ను తాజాగా హైదరాబాద్ లో నిర్వహించారు. ఇందులో ప్రొడ్యూసర్ ఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ రుక్మిణి వసంత్ హీరోయిన్ అంటే ఆమె గురించి తాను ఎంక్వయిరీ చేసినట్టు- తెలిపాడు. ఆమె గురించి తనకు షాకింగ్ విషయాలు తెలిశాయన్నాడు. రుక్మిణి వసంత్ ఇప్పుడు మామూలు హీరోయిన్ కాదు. ఆమె చేతిలో వరుసగా పెద్ద సినిమాలే ఉన్నాయి. కాంతార-2 సినిమాలో ఆమెనే హీరోయిన్ గా తీసుకున్నారు. ఆ తర్వాత టాక్సిక్ లో కనిపించబోతోంది. అలాగే ఎన్టీఆర్ సినిమాలోన ఆమెనే హీరోయిన్ గా చేస్తోంది. ఈ మూవీ తర్వాత ఫుల్ బిజీగా గడపబోతోంది అంటూ తెలిపాడు. దీన్ని బట్టి ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ సినిమాలో కచ్చితంగా రుక్మిణి వసంత్ ను ఫిక్స్ చేశారని తేలిపోయింది. ఆమె పేరు చాలా కాలంగా వినిపిస్తోంది. కానీ మూవీ టీమ్ అధికారికంగా ప్రకటించలేదు. ఇప్పుడు నిర్మాత స్వయంగా చెప్పడంతో అసలు విషయం బయటకు వచ్చేసింది. దీనిపై త్వరలోనే అఫీషియల్ ప్రకటన కూడా రాబోతోందంట. రుక్మిణి వసంత్ ప్రస్తుతం సౌత్ లో పెద్ద సినిమాలతో ఫుల్ బిజీగా ఉంటుంది. ఆమె ఎన్టీఆర్ సరసన సూపర్ గా సెట్ అవుతుందని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



# ఇక ఏడాదికో సినిమా చేస్తా

## ఘాటీపై రానాతో ఇంటర్వ్యూలో అనుష్క

ఎలాంటి పాత్రలోనైనా తనదైన శైలిలో నటించి మెప్పించగలిగిన అనుష్క ఇప్పుడు 'ఘాటీ-' అంటూ భిన్నమైన కథతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆమె ప్రధానపాత్రలో క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో అనుష్క ఆఫ్‌స్క్రీన్‌లో పాల్గొంటున్నారు. తాజాగా నటుడు రానా ఆమెతో ఫోన్‌లో ఓ ఇంటర్వ్యూ చేశారు. అందులో అనుష్క 'ఘాటీ' విశేషాలను పంచుకున్నారు. ఆంధ్రా- ఒడిశా బార్డర్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. 'బాహుబలి', 'అరుంధతి' తర్వాత వం-సలో 'ఘాటీ-' నిలుస్తుంది. ఇందులోని వయోలెన్స్‌ను పక్కన పెడితే.. ఈ కథ ఇప్పటి సమాజంలోని పరిస్థితులకు సరిపోతుంది. క్రిష్ నాకెప్పుడూ గొప్ప పాత్రలు ఇస్తారు. 'వేదం'లో సరోజ కూడా చాలా సున్నితమైన పాత్ర. దాన్ని ఆయన గొప్పగా చూపించారు. నా కెరీర్‌లో గుర్తిండిపోయే పాత్రల్లో అదీ ఒకటి. ఇప్పుడు 'ఘాటీ'లో 'షీలావతి' కూడా అలాంటి గుర్తింపునే ఇస్తుందని చెప్పారు. ఇకపై ఇలానే మూడేళ్లకు ఒక సినిమా చేస్తావా, నిన్ను కలిసి సుమారు 10 ఏళ్లు అవుతోందని రానా అడగ్గా దానికి స్వీటీ- నవ్వుతూ బదులిచ్చారు. మంచి స్క్రిప్ట్‌లు ఎంపిక చేసుకుంటున్నాను. వచ్చే ఏడాది నుంచి వరుస సినిమాలు చేస్తా. అలాగే అందరి ముందుకు కూడా వస్తాను. మా ఇళ్లలో జరిగే పెళ్లిలకు కూడా వెళ్లడం లేదు. అందరూ ఎప్పుడు కనిపిస్తావ్ అని అడుగుతున్నారు. త్వరలోనే కనిపిస్తానని చెప్పారు. ఇక 'ఘాటీ'ని అంగీకరించినప్పుడే ఆమె ఈ సినిమా ప్రచారంలో భాగం కానని చెప్పినట్లు నిర్మాత ఇటీ-వలే చెప్పిన విషయం తెలిసిందే.

# కల్కి-2కు రెండుమూడేళ్లు పట్టవచ్చు: నాగ్ అశ్విన్



'కల్కి సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో భారీ వసూళ్లను రాబట్టిన దర్శకుడు నాగ్ అశ్విన్. అయితే, ఇప్పుడు ఈ సినిమా సీక్వెల్‌కి సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 2024 జూన్ నెలలో విడుదలైన 'కల్కి' లో ప్రభాస్ ప్రధాన పాత్రల్లో నటించగా.. బాక్సాఫీస్ వద్ద దుమ్ము లేపింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించి టాలీవుడ్ పవర్ ను విశ్వవ్యాప్తంగా మరోసారి చాటి చెప్పింది. ఈ భారీ విజయంతో సినిమా అభిమానులందరి దృష్టి ఇప్పుడు 'కల్కి 2' పై పడింది.తాజగా ఓ పోడ్కాస్ట్‌లో పాల్గొన్న నాగ్ అశ్విన్ మాట్లాడుతూ.. 2025 చివర్లో 'కల్కి 2' షూటింగ్ ప్రారంభించాలని అనుకున్నట్లు- ఆయన అన్నారు. అయి-తే, ఇందులో చాలా అంశాలు కలసి రావాల్సి ఉంది. ముఖ్యంగా సినిమాలోని నటులందరి షెడ్యూల్స్ కుదరాలి. అలాగే ఇప్పటికే ప్రీ-విజువలైజ్ చేసిన యాక్షన్ సన్నివేశాలు చాలా పెద్దవి కాబట్టి మరింత సమయం పడుతుంది. ప్రస్తుతానికి ఖచ్చితమైన సమాధానం చెప్పలేను. ఆర్టిస్టులందరూ అందరూ బిజీగా ఉన్నారు అని అన్నాడు. అలాగే షూటింగ్ కంటే పోస్ట్ ప్రొడక్షన్ మరింత సమయం పడుతుందని ఆయన పేర్కొన్నారు. మరో 2 లేదా 3 సంవత్సరాల్లో సినిమా పూర్తవుతుందని అనుకుంటున్నానని భారీ బాంబ్ పేల్చాడు. అప్పటివరకు అభిమానులు ఓపిక పట్టాలి అంటూ నాగ్ అశ్విన్ స్పష్టం చేశారు. 'కల్కి 2898 ఆడ'లో ప్రభాస్, దీపికా పదుకోనేతో పాటు- బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్, తమిళ సూపర్ స్టార్ కమల్ హాసన్ లు కీలక పాత్రల్లో కనిపించారు.




# విమెన్ పవర్‌ను పురుషులే గుర్తిస్తారు

## తమన్నా ఆసక్తికర వ్యాఖ్యలు

సినీ ఇండస్ట్రీలో గ్లామర్ రోల్స్ నుంచి వైవిధ్యమైన పాత్రల వరకు తనదైన ముద్ర వేసుకున్న నటి తమన్నా భాటియా. ఇటీవల ఒక కార్యక్రమంలో ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. సాధారణంగా మహిళలు తమ శక్తిని తాము గుర్తించకపోవచ్చని, కానీ జీవితంలో ఉన్న అద్భుతమైన పురుషుడు దాన్ని ప్రతిబింబంగా చూపిస్తారని ఆమె భావన వ్యక్తం చేసింది. తన జీవితంలో అలాంటి వ్యక్తులు ఉన్నారని ఆమె చెప్పిన తీరు, స్పష్టంగా నటుడు విజయ్ వర్మ గురించి అని అభిమానులు భావిస్తున్నారు. విజయ్ వర్మ తన జీవితంలోకి వచ్చాక తమన్నా నిజంగానే ఆత్మవిశ్వాసంతో, ఆనందంగా కనిపించింది. అయితే తర్వాత వారి కెరీర్ ప్రెజర్ కారణంగా విభేదాలు వచ్చి విడిపోయారనే వార్తలు వైరల్ అయ్యాయి. కానీ ఈ జంట ఒకరిపై ఒకరు నెగెటివ్‌గా మాట్లాడకుండా, పరస్పర గౌరవంతో సంబంధాన్ని ముగించుకోవడం అందరినీ ఆకట్టుకుంది. తమన్నా వ్యాఖ్యల్లో అర్థం చేసుకునే స్వభావం ఇప్పుడు మహిళలకు ఒక ప్రేరణ గా మారుతోంది. సాధారణంగా బ్రేకప్‌ల తర్వాత, మీడియా ఎదుట ఏ జంట అయిన అగౌరవంగా మాట్లాడతారు.. కానీ తమన్నా తన భావాలను చెప్పిన తీరు మెచ్చుకోదగినయి. మొత్తానికి, ఈ వ్యాఖ్యలు తమన్నా వ్యక్తిత్వాన్ని మాత్రమే కాకుండా, ఆమె లోని మ్యాచ్యూరిటీ- ని కూడా హైలైట్ చేశాయి.

# శ్రీదేవి చాల్‌బాజ్ రీమేక్‌పై వార్తలు

## జాన్వీ కపూర్‌తో తీసే ఆలోచనలు



శ్రీదేవి, రజనీకాంత్, సన్నీదేవోల్ నటించిన హిట్ సినిమా 'చాల్‌బాజ్'. 1989లో వచ్చిన ఈ చిత్రం నటన పరంగా శ్రీదేవి కెరీర్‌లోనే బెస్ట్ సినిమాల లిస్ట్‌లో ముందు వరుసలో ఉంటుంది. పంకజ్ పరాశర్ దర్శకత్వంలో వచ్చిన ఈ మూవీ రీమేక్ ఇప్పటికే ఎన్నోసార్లు బాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. తాజాగా మరోసారి ఇది హాట్‌టాపిక్‌గా మారింది. బాలీవుడ్‌లో ఓ బడా నిర్మాత జాన్వీకపూర్‌తో ఈ సినిమా తీయనున్నట్లు- వార్తలు వస్తున్నాయి. తన తల్లి శ్రీదేవికి సంబంధించిన విషయాలే కాదు.. ఆమె నటించిన ప్రతి చిత్రం తనకు ఓ ఎమోషన్ అని జాన్వీకపూర్ ఎప్పుడూ చెబుతుంటారు. సందర్భం వచ్చినప్పుడల్లా ఆమెతో అనుబంధాన్ని పంచుకుంటుంటారు. అందుకే 'చాల్‌బాజ్'లో శ్రీదేవి పాత్రను పోషించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు- తెలుస్తోంది. జాన్వీకి ఇష్టమైన శ్రీదేవి సినిమాల్లో 'చాల్‌బాజ్' కూడా ఒకటని చాలెంజ్‌గా తీసుకొని ఈ పాత్ర కోసం గ్రౌండ్ వర్క్ చేస్తున్నట్లు- బాలీవుడ్ మీడియా పేర్కొంది. ఈ రీమేక్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. దీనికి దర్శకుడు ఎవరు అనే విషయాన్ని కూడా త్వరలోనే వెల్లడించనున్నారట. గతంలో ఈ సినిమాను 'చాల్‌బాజ్ ఇన్ లండన్' పేరుతో రీమేక్ చేయాలని భావించారు. శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో నటించనున్నట్లు- పోస్టర్లు కూడా విడుదల చేశారు. అయితే ఈ ప్రాజెక్ట్ కొన్ని కారణాల వల్ల మధ్యలోనే ఆగిపోయింది. ఇప్పుడు జాన్వీ నటించనున్నట్లు- వార్తలు రావడంతో మరోసారి ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. 'చాల్‌బాజ్'లో శ్రీదేవి ద్విపాత్రాభినయంలో కనిపించి ఆకట్టుకున్నారు. ఇప్పుడు జాన్వీ కూడా అలానే కనిపిస్తారా లేదంటే రీమేక్ కథలో మార్పులు చేస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఈ బ్యూటీ- వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇటీ-వలే 'పరమ్ సుందరి'తో పలకరించారు. త్వరలోనే 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి'తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నారు అక్టోబర్ 2న ఈ చిత్రం విడుదల కానుంది. దీనితో పాటు- తెలుగులో 'పెద్ది'లో నటిస్తున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**